తెలంగాణ TELANGANA MUCHATLU



ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం – 18 – నవంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 164 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



తెలంగాణ పోలీసు శాఖలో డీఎస్పీల పదోన్నతుల సమస్యకు పరిష్కారం

- 1991, 1995, 1996 బ్యాచ్‌ల అధికారులకు ఊరట
- సీనియారిటీ, న్యాయపరమైన అంశాలపై కమిటీ కసరత్తు
- పదోన్నతుల ప్రతిపాదనలకు ఏకగ్రీవ ఆమోదం

హైదరాబాద్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ పోలీసు శాఖలో 1991, 1995, 1996 బ్యాచ్‌లకు చెందిన డీఎస్పీలు, అదనపు ఎస్పీలుగా పనిచేస్తున్న అధికారుల దీర్ఘకాలిక పదోన్నతుల సమస్య పరిష్కార దిశగా ముందడుగు

మిగతా 2 లో..



సమ్మక్క సాగర్ బ్యారేజీకి నిరభ్యంతర పత్రం ఇవ్వండి

- సీఎం రేవంత్‌రెడ్డి
- ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయికి విజ్ఞప్తి
- రాయ్‌పూర్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సమావేశం
- ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనంలో 33 ఎకరాల ముంపు అంచనా
- నిరభ్యంతర పత్రం ప్రక్రియ త్వరగా పూర్తి చేస్తామని ఛత్తీస్‌గఢ్ హామీ

రాయ్‌పూర్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):

ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బహుళ ప్రయోజనాల బ్యారేజీకి వెంటనే నిరభ్యంతర పత్రం జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి రాయ్‌పూర్‌లో ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమ్మక్క సాగర్ ప్రాజెక్టు వివరాలను వెల్లడించి, బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై విష్ణుదేవ్ సాయి సానుకూలంగా స్పందించి, నిరభ్యంతర పత్రం జారీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలో నీటి అవసరాలు పెరిగే అవకాశముందని రేవంత్‌రెడ్డి వివరించారు. కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు సమ్మక్క సాగర్ బ్యారేజీ కీలకమని తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన అనుమతుల విషయంలోనూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సహకరించాలని కోరారు. బ్యారేజీ నిర్మాణం పూర్తయినందున ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని

మిగతా 2 లో..

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

- మంత్రి వివేక్ వెంకటస్వామి
- మందమర్రిలో కొత్త చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ
- రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా కొత్త పింఛన్లు మంజూరు
- చెన్నూరు నియోజకవర్గంలో 800 కోట్లతో అభివృద్ధి పనులు
- ఇందిరమ్మ ఇళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థల ఏర్పాటుకు చర్యలు

మందమర్రి, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మందమర్రి మండలం గద్దెరాగడిలో క్యాతన పల్లి, మందమర్రి మున్సిపాలిటీలతో పాటు మందమర్రి మండలానికి చెందిన లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన చేయూత పింఛన్ల పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఏళ్ల తరబడి పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులకు

మిగతా 2 లో..



ఇంటర్ బోర్డు రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- విద్యార్థుల స్థానికతకు ముప్పు వాటిల్లే ప్రమాదం
- ప్రజాభిప్రాయం తీసుకున్న తర్వాతే మార్పులపై నిర్ణయం
- విద్యా వ్యవస్థ పరిరక్షణకు ఐక్య ఉద్యమం చేపడతామని కల్వకుంట్ల కవిత హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):

ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేసి పాఠశాల విద్యలో విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమాజిగూడలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటర్ బోర్డు రద్దు తెలంగాణ విద్యపై ప్రభావం' రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యారంగ నిపుణులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరైన

మిగతా 2 లో..



ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు తీవ్ర నష్టం

- నిజాంపేటలో రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న మాజీ మంత్రి హరీశ్ రావు
- దొడ్డు వడ్లకు గిట్టుబాటు ధర లేక ప్రైవేటు వ్యాపారుల దోపిడీ
- పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్
- రైతు భరోసా, బీమా, త్రాగునీటి సమస్యలపై ప్రభుత్వానికి ప్రశ్నలు



నిజాంపేట, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రవ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీశ్ రావు ఆరోపించారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నిజాంపేటలో ఆయన రైతులను కలిసి ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. నిజాంపేట మండల కేంద్రంలో ఇప్పటివరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని, ప్రారంభోత్సవాల సమయంలో కొబ్బరికాయలు కొట్టినా ధాన్యం కొనుగోళ్లు మాత్రం మొదలుకాలేదని విమర్శించారు. ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోళ్లు జరగకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు పంటను విక్రయించుకోవాల్సి వస్తోందని తెలిపారు. కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తూ కొందరు రైతులు 20 రోజులుగా ధాన్యాన్ని కల్లాల్లోనే ఉంచుకున్నారని చెప్పారు.

సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.2,600 మాత్రమే చెల్లిస్తున్నారని, ప్రభుత్వం ప్రకటించిన బోనస్ అందక రైతులు నష్టపోతున్నారని హరీశ్ రావు అన్నారు. సన్న వడ్లు సాగు చేయాలని

మిగతా 2 లో..

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అభివృద్ధి కుంటుపడింది



- తెలంగాణ భవన్‌లో మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్‌చాట్
- సోనియా గాంధీ ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావనపై ప్రశ్న
- మూడేళ్ల పాలనలో సాధించిన ప్రగతిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- భారత్ సమ్మిట్‌తో రాష్ట్రానికి ప్రయోజనం కలగలేదని విమర్శ

హైదరాబాద్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):

కాంగ్రెస్ ప్రభుత్వ మూడేళ్ల పాలనలో తెలంగాణకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై పలు ఆరోపణలు చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. ఎన్నికల సమయంలో అభయహస్తం పేరుతో భరోసా కల్పించి, అధికారంలోకి వచ్చాక ప్రజలకు రిక్తహస్తం చూపించిందని వ్యాఖ్యానించారు. అన్ని వర్గాల ప్రజలకు రంగుల కలలు చూపించి మోసం చేశారని ఆరోపించారు.

సోనియా గాంధీ ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడంపై కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, ఉద్యమం వంటి అంశాలకు ఆత్మకథలో చోటు ఎందుకు కల్పించలేదని నిలదీశారు. తెలంగాణ పట్ల సోనియా గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి నిజమైన ప్రేమ లేదనే విషయం దీనితో స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు. తెలంగాణ కోసం ప్రజలు చేసిన పోరాటాన్ని గుర్తించకుండా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమానికి సంబంధించిన అంశాలను విస్మరించడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచినట్లేనని అన్నారు.

గాంధీ కుటుంబాన్ని ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. గాంధీలకు బాడీగార్డులా ముఖ్యమంత్రి ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం పోరాడిన గడ్డపై పాలకులు గులాముల్లా వ్యవహరించడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, రాష్ట్ర గౌరవానికి భంగం కలిగించేలా కాంగ్రెస్ నాయకత్వం వ్యవహరిస్తోందని అన్నారు. తెలంగాణ అభివృద్ధి దిశగా ముందుకు సాగాల్సిన సమయంలో పాలనలో ఆశించిన పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో పెట్టుబడుల పరిస్థితిపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్

మిగతా 2 లో..

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

సమ్మక్క సాగర్ బ్యారేజీకి నిరభ్యంతర పత్రం ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.
తొలుత ఈ ప్రాజెక్టును కాంతనపల్లి వద్ద నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే ఆ ప్రాంతంలో 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉండటంతో పాటు 17 ఆదివాసీ గ్రామాలు ప్రభావితమయ్యే పరిస్థితి ఏర్పడింది. భద్రత, మౌలిక సదుపాయాలపైనా ప్రభావం పడే అవకాశం ఉందని గుర్తించారు. దీంతో ముంపు సమస్యను తగ్గించేందుకు బ్యారేజీ నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చినట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాలు మాత్రమే ముంపునకు గురవుతాయని ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనంలో తేలినట్లు తెలిపారు. భారీ వరదల సమయంలోనూ ప్రభావిత ప్రాంతం పంద ఎకరాలకు మించదని పేర్కొన్నారు.
ప్రాజెక్టు అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన మేరకు తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్‌లోనే రూ.9.883 కోట్లను చెల్లించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ తన అధ్యయన నివేదికను జూలై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించింది. తుపాకులగూడెం వద్ద నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం +83 మీటర్లుగా నిర్ణయించగా, నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలుగా ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో భూసేకరణ, పరిహారం, పునరావాసానికి అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.
గోదావరి జలాలను వినియోగించుకుని రాష్ట్రంలోని కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల అవసరాలు తీర్చడమే సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని ముఖ్యమంత్రి తెలిపారు. బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అవసరమైన నిరభ్యంతర పత్రాన్ని వెంటనే జారీ చేయాలని మరోసారి కోరారు. ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన అనుమతుల మంజూరులోనూ సహకరించాలని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు. నిరభ్యంతర పత్రం ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని విష్ణుదేవ్ సాయి హామీ ఇచ్చినట్లు తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది.

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అభివృద్ధి కుంటుపడింది

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడేళ్లలో ఎన్ని పెట్టుబడులు వచ్చాయి, వాటి ద్వారా ఎన్ని పరిశ్రమలు ఏర్పాటయ్యాయి, ఎంతమందికి ఉపాధి లభించిందనే వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు. తెలంగాణ రైజింగ్ అని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని, వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్రం అభివృద్ధి చెందడం లేదని, తెలంగాణ రైజింగ్ కాదు.. తెలంగాణ ఫాలింగ్ అని విమర్శించారు. పెట్టుబడులపై ప్రకటనలకు పరిమితం కాకుండా వాస్తవ గణాంకాలను వెల్లడించాలని సూచించారు. భారత్ సమ్మిట్ నిర్వహణ వల్ల తెలంగాణ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడే వేదికగా కాకుండా రాజకీయ సమ్మిట్‌గా మారిందని విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు తీసుకొచ్చే కార్యక్రమాలు చేపట్టాల్సిన ప్రభుత్వం ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో సాధించిన అభివృద్ధి, పెట్టుబడుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని, ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇంటర్ బోర్డు రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రతిపాదన వల్ల విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను కవిత ప్రస్తావించారు. 55 ఏళ్లుగా కొనసాగుతున్న వ్యవస్థను ఏకపక్షంగా రద్దు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు.
ఇంటర్ బోర్డు రద్దు వల్ల తెలంగాణ విద్యార్థులకు స్థానికత అంశంలో నష్టం జరిగే ప్రమాదం ఉందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. తొమ్మిదో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు నిర్వహించే విద్యాసంస్థలకు అనుమతులు ఇస్తే ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అక్కడ అడ్మిషన్లు తీసుకుని తెలంగాణలో పరీక్షలు రాసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దీనివల్ల స్థానిక విద్యార్థుల ప్రయోజనాలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఉత్తర భారతదేశానికి చెందిన విద్యా సంస్థలు కూడా తెలంగాణలోకి వస్తున్నాయని, వాటిలో స్థానికులకు తగిన అవకాశాలు లభించడం లేదని విమర్శించారు. ఈ నిర్ణయం అమలైతే విద్యార్థుల భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం ఉంటుందో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.
ఇంటర్ బోర్డును పాఠశాల విద్యలో కలపడం వల్ల ప్రయోజనం ఉంటుందనే దానికి ఆధారాలు చూపించాలని కవిత డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ప్రయోగం ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని, మహారాష్ట్రలో పదో తరగతి, ఇంటర్మీడియట్ బోర్డులు కొనసాగుతున్నాయని ఉదహరించారు. కేరళలో విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావడానికి దాదాపు పదేళ్లపాటు దశలవారీగా సమయం తీసుకున్నారని గుర్తుచేశారు. తెలంగాణలోనూ తొందరపాటు నిర్ణయాలకు బదులుగా విద్యారంగ నిపుణులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ఇతర భాగస్వాములతో చర్చించాలని సూచించారు. బిల్లు తీసుకొచ్చే ముందు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి, ప్రతి జిల్లాలో సంబంధిత పత్రాలను అందుబాటులో ఉంచాలని కోరారు.
ప్రభుత్వ విద్యాసంస్థల్లో ముందుగా మౌలిక సదుపాయాలు మెరుగుపరిచి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కవిత అన్నారు. ఇంటర్ బోర్డు రద్దు చేస్తే జూనియర్ అధ్యాపకుల పరిస్థితి ఏమిటనే ప్రశ్నను లేవనెత్తారు. గతంలోనూ బోర్డు రద్దుపై ప్రకటన వచ్చినప్పుడు అధికారులు అడ్మిషన్లు కొనసాగిస్తామని చెప్పారని, ఇప్పుడు మళ్లీ అదే అంశాన్ని తెరపైకి తీసుకురావడంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యారంగంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యా వ్యవస్థను ఐసీయూలో ఉంచితే, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటిలేటర్‌పైకి తీసుకువచ్చిందంటూ వ్యాఖ్యానించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన అనేక మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్య ద్వారా ఉన్నత స్థాయికి చేరుకున్నారని, బోర్డు రద్దు వారి అవకాశాలను ప్రభావితం చేయకూడదని పేర్కొన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఐక్య ఉద్యమం చేపడతామని కవిత హెచ్చరించారు. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా అన్ని జిల్లాల్లోనూ రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి, ఈ నిర్ణయం వల్ల కలిగే పరిణామాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. విద్యారంగంలోని లోపాలను ప్రశ్నించే హక్కు ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఉందని పేర్కొంటూ, గతంలో ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి సమస్యలను ప్రస్తావించినప్పుడు ముఖ్యమంత్రి బెదిరించే ధోరణిలో మాట్లాడారని ఆరోపించారు. తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కొత్తగా మంజూరైన చేయూత పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎంపీ

- ఎల్లంపేట మున్సిపాలిటీలో పింఛన్ల ప్రాసీడింగ్స్ అందజేత
- లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు
- ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరు



మేడ్చల్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ సర్కిల్ పరిధిలోని ఎల్లంపేట మున్సిపాలిటీలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి లబ్ధిదారులకు పింఛన్ మంజూరు ప్రొసీడింగ్స్ అందజేశారు. కొత్తగా చేయూత పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు సంబంధిత పత్రాలను ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. పింఛన్ల మంజూరును అధికారికంగా తెలియజేసే ప్రొసీడింగ్స్‌ను అందజేసే కార్యక్రమం స్థానికంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి, వైస్ చైర్‌పర్సన్ రజిత దేవేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ మనూ చౌదరి కార్యక్రమంలో పాల్గొని పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు సంబంధించిన వివరాలను అధికారుల సమక్షంలో అందజేశారు. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా చేయూత పింఛన్లు మంజూరైన వారికి ప్రొసీడింగ్స్ పంపిణీ చేయడంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. స్థానిక సంస్థల ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు కూడా హాజరుకావడంతో కార్యక్రమం నిర్వహణ పూర్తయింది.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా కొత్త పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అర్హత ఉన్నప్పటికీ పింఛన్లు అందని వారిని గుర్తించేందుకు మరోసారి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, అర్హులందరికీ పింఛన్లు అందేలా చూస్తామని చెప్పారు.ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్న లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో గత ఏడాది 3,500 ఇళ్లు, ఈ ఏడాది మరో 2,000 ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 1,800 ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. మందమర్రి ఏజెన్సీ ప్రాంతంలో భూమి సమస్య పరిష్కారానికి సింగరేణి సంస్థతో చర్చలు జరుపుతున్నామని, ఆరు ఎకరాల స్థలంలో సుమారు 600 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. చెన్నూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం రూ.800 కోట్లతో వివిధ పనులు చేపట్టినట్లు వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఇందులో భాగంగా రూ.100 కోట్లతో తాగునీటి సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. సోమన్‌పల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, మందమర్రిలో రూ.10 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్య, మౌలిక సదుపాయాల రంగాల్లో నియోజకవర్గానికి అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. వైద్య సదుపాయాల విస్తరణలో భాగంగా చెన్నూరులో 100 పడకల ఆసుపత్రిని త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. మందమర్రిలో మరో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కొత్త బొగ్గు గనుల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు మెరుగైన వైద్యం, విద్య, తాగునీటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనులు కొనసాగిస్తున్నట్లు వివరించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని వివేక్ వెంకటస్వామి తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాల వంటి పథకాలతో పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు చెన్నూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. మాటలకే పరిమితం కాకుండా పనుల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

తెలంగాణ పోలీసు శాఖలో డీఎస్పీల పదోన్నతుల సమస్యకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

పడింది. వివిధ కారణాలతో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై డీజీపీ సీవీ ఆనంద్ చొరవ తీసుకున్నారు. ఆయన కృషితో పదోన్నతుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు మార్గం సుగమమైంది.
గతంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో పదోన్నతులకు ఎదురవుతున్న న్యాయపరమైన, పరిపాలనాపరమైన చిక్కులను డీజీపీ వివరించారు. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు సహకరించాలని కోరారు. దీనికి స్పందించిన అధికారులు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న తమ కేసులను ఉపసంహరించుకున్నారు. డీజీపీ నిర్ణయాలపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, తమకు ప్రతికూలంగా నిర్ణయం వచ్చినా తదుపరి న్యాయపరమైన చర్యలకు వెళ్లబోమని అఫిడవిట్లు సమర్పించారు.
ఈ నేపథ్యంలో డీజీపీ కార్యాలయం, ఐజీ (పర్సనల్)తో కూడిన కమిటీ గత కొన్ని నెలలుగా పదోన్నతులకు సంబంధించిన అంశాలను పరిశీలించింది. సీనియారిటీ జాబితాలు, వాటిలోని వ్యత్యాసాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సమగ్రంగా అధ్యయనం చేసింది. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని సిఫార్సులు రూపొందించింది. కమిటీ చేసిన సిఫార్సులను డీజీపీ మరోసారి అధికారులతో నిర్వహించిన సమావేశంలో వివరించారు. అందుబాటులో ఉన్న ఖాళీలతో పాటు ప్రతి అధికారి వారీగా ప్రతిపాదించిన పదోన్నతి, అది అమల్లోకి వచ్చే తేదీ వివరాలను వెల్లడించారు. ఈ ప్రతిపాదనలకు అధికారులందరూ ఏకగ్రీవంగా అంగీకారం తెలిపారు. దీంతో చాలాకాలంగా కొనసాగుతున్న ప్రతిష్టంభన తొలగినట్లయింది.
కమిటీ కసరత్తు జరగకపోయి ఉంటే పలువురు అధికారులు పదోన్నతి పొందకుండానే ప్రస్తుత హోదాల్లో పదవీ విరమణ చేయాల్సిన పరిస్థితి ఉండేదని అధికారులు అభిప్రాయపడ్డారు. తాజా సిఫార్సులను ప్రభుత్వానికి నివేదించిన అనంతరం దశలవారీగా పదోన్నతుల ప్రక్రియ చేపట్టనున్నారు. తొలుత 1991 బ్యాచ్ అధికారులతో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ పరిష్కారానికి సహకరించిన అధికారులను డీజీపీ అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు తీవ్ర నష్టం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మి పంట వేసిన రైతులకు ఇప్పుడు గిట్టుబాటు ధర దక్కడం లేదని విమర్శించారు. నల్గొండ, నిజామాబాద్ జిల్లాల నుంచి కూడా రైతులు ఫోన్ చేసి తమ సమస్యలను వివరిస్తున్నారని పేర్కొన్నారు. ఆయా జిల్లాల్లో క్వింటాల్ ధాన్యాన్ని రూ.2,600 నుంచి రూ.2,700 మధ్యే విక్రయించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారని తెలిపారు. దొడ్డు రకం వడ్లను కొనుగోలు చేసేవారు లేకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారని, వారు క్వింటాల్‌కు సుమారు రూ.2,200 మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. దీనికి తోడు క్వింటాల్‌కు పది కిలోల వరకు తరుగు తీస్తుండటంతో రైతులకు మరింత నష్టం జరుగుతోందన్నారు. దొడ్డు వడ్లను ఎలాంటి కోతలు, తరుగు లేకుండా కొనుగోలు చేయాలని, సన్న వడ్ల బోనస్‌కు సంబంధించి ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
రైతు భరోసా పథకం అమలులో ప్రభుత్వం మూడు విడతలు ఎగ్గొట్టిందని, రుణమాఫీ హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని హరీశ్ రావు విమర్శించారు. యాసంగి రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఇటీవల రైతు భరోసా డబ్బులు జమ అయినట్లు కొందరికి సందేశాలు వచ్చాయని, బ్యాంకులకు వెళ్లి విచారిస్తే అవి నకిలీ సందేశాలని చెబుతున్నారని రైతులు తనకు వివరించినట్లు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినా ఇప్పటివరకు నష్టం అంచనాలు పూర్తి చేయలేదని ఆరోపించారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.5 వేల చొప్పున సహాయం అందిస్తున్నారని ప్రస్తావించారు. తెలంగాణలోనూ పంటలు కోల్పోయిన రైతులను గుర్తించి తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున సహాయం అందించిందని గుర్తుచేశారు.
నారాయణఖేడ్ ప్రాంతంలో త్రాగునీటి సమస్య కూడా ఉందని, మెగ్యానాయక్ తండాలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని స్థానికులు తనకు తెలిపినట్లు హరీశ్ రావు వెల్లడించారు. ప్రజలకు త్రాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. నల్లవాగు, నిజాంసాగర్‌లో నీరు అందుబాటులో ఉన్నందున అవసరమైన చర్యలు చేపట్టి నీటిని ఎత్తిపోసి గ్రామాలకు సరఫరా చేయాలని కోరారు. నారాయణఖేడ్‌తో పాటు మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి ప్రజలు వలస వెళ్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు, ప్రజల జీవన పరిస్థితులపై ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు. అమలు కాని పథకాలకు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ పేర్లు పెట్టడం కంటే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పథకాలు అమలు చేయలేకపోతే వాటికి ముఖ్యమంత్రి పేరు పెట్టుకోవాలని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.రైతు బీమా ప్రీమియం చెల్లింపులు సక్రమంగా జరగకపోవడంతో రైతులు మరణించిన సందర్భాల్లో వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. కొత్త బీమా పథకం ఎప్పుడు అమలవుతుందో తెలియదని, ముందుగా ఇప్పటికే ఉన్న రైతు బీమాను సక్రమంగా అమలు చేయాలని కోరారు. కొత్త బీమా ఒక్క ఇంటికి ఒకరికే వర్తిస్తుందని చెబుతున్నారని, దాని వల్ల రైతు కుటుంబాలకు ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటివరకు మరణించినట్లు పేర్కొంటున్న మూడు వేల మంది రైతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆ నిధులను కూడా విడుదల చేయాలని అన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా ప్రకటనలతో సరిపెట్టడం వల్ల ప్రయోజనం ఉండదని విమర్శించారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
బుధవారం - 18 - నవంబర్ 2026
వరంగల్ 03

పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



- **వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలి – హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

భీమదేవరపల్లి, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోని మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరిట నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.

మంగళవారం పీవీ విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విజ్ఞాన కేంద్రంలోని ఫోటో గ్యాలరీ, మ్యూజియం, కాన్ఫరెన్స్ హాల్, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మొక్కలు, పరిసరాలను పరిశీలించి పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీవీ విజ్ఞాన కేంద్రంలో అభివృద్ధి పనులు దాదాపు పూర్తయ్యాయని, ప్రస్తుతం ఆర్ట్ గ్యాలరీకి సంబంధించిన పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆర్ట్ గ్యాలరీ పనులను ఆర్కిటెక్ట్ పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ఆర్ట్ గ్యాలరీలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహం ఏర్పాటు, సీసీ కెమెరాలు, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర మిగిలిన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

అదేవిధంగా విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అన్ని అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి వచ్చే నెలలో పీవీ విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

ఈ పర్యటనలో స్థానిక సర్పంచ్ సృజన, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈఈ భీమ్ రావు, తహసీల్దార్ రాజేష్, డీఈలు, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మావోయిస్టుల స్థావరాల నుంచి 280 బారెల్ గ్రెనేడ్ లాంచర్ గుండ్లు స్వాధీనం



- **తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో తనిఖీలు**
- **మూడు రహస్య డంపుల్లో పేలుడు సామగ్రి గుర్తింపు**
- **2025 ఆరంభంలో దాచినట్లు పోలీసుల వెల్లడి**
- **లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపు**

కొత్తగూడెం, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు దాచిన 280 బారెల్ గ్రెనేడ్ లాంచర్ (బీజీఎల్) గుండ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నవంబర్ 16న నిర్వహించిన గాలింపు చర్యల్లో ఈ పేలుడు సామగ్రి బయటపడింది. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసు సిబ్బంది, ప్రత్యేక పార్టీ సభ్యులు, బాంబు నిర్వీర్య బృందం సంయుక్తంగా అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గాలింపు సమయంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ బెటాలియన్‌కు చెందిన మూడు రహస్య స్థావరాలను గుర్తించారు. సింటెక్స్ నీటి ట్యాంకుల ద్రములో బీజీఎల్ గుండ్లను దాచి ఉంచినట్లు పోలీసులు వెల్లడించారు. ఆయా డంపుల్లో ఉన్న సామగ్రిని బయటకు తీసి లెక్కించగా మొత్తం 280 గుండ్లు ఉన్నట్లు నిర్ధారించారు.స్వాధీనం చేసుకున్నమందుగుండు సామగ్రి పీఎల్‌జీఏ బెటాలియన్‌కు చెందిన మొదటి కంపెనీదిగా పోలీసులు పేర్కొన్నారు. 2025 ప్రారంభంలో వీటిని అటవీ ప్రాంతంలోని రహస్య ప్రదేశాల్లో దాచినట్లు ప్రాథమికంగా వెల్లడించారు. భవిష్యత్తులో కార్యకలాపాలు తిరిగి ప్రారంభించినప్పుడు వినియోగించుకునే ఉద్దేశంతో దట్టమైన అడవుల్లో వీటిని భద్రపరిచినట్లు పోలీసుల ప్రకటనలో పేర్కొన్నారు. మావోయిస్టులు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసేందుకు తెలంగాణ ప్రభుత్వం పునరావాస విధానాన్ని అమలు చేస్తోందని పోలీసులు తెలిపారు. 2025 చివరి భాగంలో, 2026 ప్రారంభంలో పలువురు మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు వెల్లడించారు. లొంగిపోయిన వారికి ప్రకటించిన ప్రోత్సాహక నగదును వెంటనే అందించడంతో పాటు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూమికి సహాయం, స్వయం ఉపాధి కోసం బ్యాంకు రుణాలు కల్పిస్తున్నట్లు వివరించారు.

లొంగిపోయిన మావోయిస్టులకు ఆరోగ్య రక్షణ పథకం కింద ఆరోగ్య కార్డులు కూడా అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వారు సాధారణ జీవితం గడిపేందుకు అవసరమైన సహాయాన్ని మానవీయ దృక్పథంతో అందిస్తున్నామని పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు హింసాత్మక మార్గాన్ని వీడి పోలీసుల ఎదుట లొంగిపోవాలని, ప్రధాన స్రవంతిలో చేరి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని భద్రాద్రి కొత్తగూడెం పోలీసులు విజ్ఞప్తి చేశారు.





తల్లాడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

ఖమ్మం బ్యూరో, నవంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు): తల్లాడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ స్టేషన్ నిర్వహణ, స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను, సిబ్బంది పనితీరును పరిశీలించిన కమిషనర్, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నేర నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా సెక్టర్ అధికారులు, పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్స్ లో వస్తున్న అధునాతన పద్ధతులను అందిపుచ్చుకోవాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్లలో డేటా నమోదు, దర్యాప్తు ప్రక్రియలో పారదర్శకత, సాంకేతికతను మెరుగుపరచడంలో ఈ వ్యవస్థ అత్యంత కీలకమని స్పష్టం చేశారు.జిల్లాలో వివిధ రకాల నేరాలకు పాల్పడుతున్న వారిని కనిపెట్టేందుకు ఈ ప్రాజెక్టులో నూతన పద్ధతులు ప్రవేశపెడుతున్నారని , వాటిపై పరిణితి సాధించాలని సూచించారు. ఉన్నతాధికారులు ప్రాజెక్టును సమర్థవంతంగా ఉపయోగించాలని..... తద్వారా క్రింది స్థాయి సిబ్బంది మరింత మెరుగ్గా వినియోగించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రాజెక్టులో భాగంగా ఈసమన్స్, ఈసాక్ష్యా వంటి వాటిని విస్తృతంగా ఉపయోగించాలని వివరించారు. రౌడీ షీటర్ల ను కౌన్సిలింగ్ చేయాలని, అదేవిదంగా నిఘా పెట్టాలని ఆదేశించారు.

చదువే ఆయుధం.. ఉద్యోగమే లక్ష్యం.. మాదిగ విద్యార్థులకు పిలుపు!

- **వర్గీకరణ ఫలాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలి.**
- **చదువుతో పాటు పోటీ పరీక్షల్లోనూ రాణించాలి.**
- **ఎమ్మార్పీఎస్ జిల్లా కో-ఇన్‌చార్జి తడుగుల విజయ్ మాదిగ**



ఎల్కతుర్తి, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): ఎస్సీ వర్గీకరణ ద్వారా సాధించుకున్న హక్కులు, అవకాశాలను ప్రతి మాదిగ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా ఎమ్మార్పీఎస్ కోఇన్‌చార్జి తడుగుల విజయ్ మాదిగ పిలుపునిచ్చారు. విద్య ద్వారానే సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి విద్యార్థి చదువుతో పాటు పోటీ పరీక్షల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

మంగళవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) మండల అధ్యక్షుడు గొల్లమందల చరణ్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి తడుగుల విజయ్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాగిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా సాధించుకున్న హక్కులు, అవకాశాలను ప్రతి మాదిగ విద్యార్థి అందిపుచ్చుకోవాలని సూచించారు. వర్గీకరణ ఫలాలు కేవలం రిజర్వేషన్లకే పరిమితం కాకుండా విద్య, ఉద్యోగ రంగాల్లో మాదిగ విద్యార్థుల అభ్యున్నతికి మార్గం చూపాలని అన్నారు. అందుకు ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్య, వివిధ పోటీ పరీక్షల్లో రాణించేలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోని మాదిగ విద్యార్థులకు విద్య పట్ల అవగాహన కల్పించి, వారిని ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించడంలో ఎంఎస్ఎఫ్ నాయకులు కీలక పాత్ర పోషించాలని కోరారు. ప్రతి గ్రామంలో విద్యార్థులను సంఘటితం చేస్తూ నూతన ఎంఎస్ఎఫ్ కమిటీలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు.


అదేవిధంగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఎస్ఎఫ్‌ను క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలను దాటి జాతీయ స్థాయి వరకు పటిష్టమైన కమిటీ నిర్మాణం చేపట్టాలని సూచించారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, వారికి విద్యా, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తూ ఎంఎస్ఎఫ్‌ను బలమైన విద్యార్థి ఉద్యమ శక్తిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

ఈ నెల 26వ తేదీన హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఎంఎస్ఎఫ్ నూతన జిల్లా కమిటీ ఏర్పాటు కార్యక్రమానికి ఎల్కతుర్తి మండలంలోని విద్యార్థులు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తడుగుల విజయ్ మాదిగ కోరారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అడ్డూరి అనిల్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు కొయ్యడ రాజేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి చిలుమల వినోద్ మాదిగ, మండల సీనియర్ నాయకులు అడ్డూరి నవీన్ మాదిగ, బొంకూరి వంశీ మాదిగ, ఇంద్రనగర్ గ్రామ శాఖ అధ్యక్షుడు నమీండ్ల ప్రవీణ్ మాదిగ, గోపాల్‌పూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు నమీండ్ల నరేష్ మాదిగ, కొత్తులనడుమ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్రోళ్ల అనిల్ మాదిగ, చింతలపల్లి గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు శనిగరం వంశీ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు అల్లకొండ బాలస్వామి మాదిగ, అడ్డూరి సుధాకర్ మాదిగ, దామెర ఎమ్మార్పీఎస్ నాయకుడు కృష్ణంరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

దేశ గౌరవాన్ని పణంగా పెట్టి రాజకీయాలా?.. కాంగ్రెస్‌పై శ్రీకాంత్ యాదవ్ ఆగ్రహం!

- **భారత్ సమ్మిట్ వేదికగా విదేశీ నేత రాజకీయ వ్యాఖ్యలు..**
- **రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి**



ఎల్కతుర్తి నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నవంబర్ 13, 14 తేదీల్లో నిర్వహించిన భారత్ సమ్మిట్ వేదికగా విదేశీ రాజకీయ ప్రతినిధి జియాకోమో ఫిలిబెక్ భారతదేశ అంతర్గత రాజకీయాలపై చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం దేశ గౌరవం, ప్రజాస్వామ్య ప్రతిష్టను పణంగా పెట్టడం సరికాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, దేశంలో ప్రభుత్వాలను నిర్ణయించే అధికారం ప్రజలకే ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలుపోటములు ప్రజల తీర్పుపై ఆధారపడి ఉంటాయని, ఎన్నికలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలు, ఎన్నికల సంఘం, న్యాయస్థానాలను ఆశ్రయించాలని అన్నారు.అయితే ఇటలీకి చెందిన పార్టీ ఆఫ్ యూరోపియన్ సోషలిస్ట్ (పీఈఎస్) సెక్రటరీ జనరల్ జియాకోమో ఫిలిబెక్ భారతదేశానికి వచ్చి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' అంటూ రాజకీయ నినాదాలు చేయడం, భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భారతదేశ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో విదేశీ రాజకీయ ప్రతినిధుల జోక్యం తగదని పేర్కొన్నారు.కాన్ఫరెన్స్ వీసాపై భారత్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధి వీసా నిబంధనలు, భారత చట్టాలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు వీసా నిబంధనలకు విరుద్ధమా కాదా అనే అంశంపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.భారత్ సమ్మిట్ వేదికగా దేశ ప్రధానిపై విదేశీ ప్రతినిధి రాజకీయ నినాదాలు చేస్తుంటే, పక్కనే ఉన్న రాహుల్ గాంధీ నవ్వుతూ స్పందించడం పట్ల శ్రీకాంత్ యాదవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నిజంగా భారత ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవిస్తే విదేశీ ప్రతినిధి వ్యాఖ్యలను ఖండించాల్సిందని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం విదేశీ నాయకులను వేదికపైకి తీసుకొచ్చి దేశ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో దెబ్బతీసే ప్రయత్నం చేయడం సరికాదని విమర్శించారు.ఈ వ్యవహారంపై రాహుల్ గాంధీ దేశ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విదేశీ ప్రతినిధి వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే వీసా రద్దుతో సహా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కార్యక్రమానికి వేదిక కల్పించిన నిర్వాహకుల బాధ్యతపైనా విచారణ జరపాలని అన్నారు. ఇదే అంశంపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు నేతృత్వంలోని బృందం ఇప్పటికే హైదరాబాద్‌లోని విదేశీయుల ప్రాంతీయ నమోదు కార్యాలయం (ఎఫ్ఆర్ఆర్ఓ), డీజీపీ సీవీ ఆనంద్‌కు ఫిర్యాదు చేసిందని తెలిపారు.భారత ప్రజాస్వామ్యం ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడలేదని, దేశ భవిష్యత్తును నిర్ణయించేది భారత ప్రజలేనని శ్రీకాంత్ యాదవ్ స్పష్టం చేశారు. దేశ గౌరవం, ప్రజాస్వామ్య ప్రతిష్ట విషయంలో బీజేపీ ఎప్పటికీ రాజీపడబోదని పేర్కొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

దీక్షా దివస్ సభను విజయవంతం చేద్దాం





- **కేసీఆర్ ఆమరణ దీక్షతోనే తెలంగాణ రాష్ట్ర సాధనకు చారిత్రక మలుపు**
- **అలుగునూర్ సభకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలిరావాలి – డాక్టర్ రసమయి బాలకిషన్**

కరీంనగర్, నవంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక ఘట్టమైన దీక్షా దివస్ స్ఫూర్తిని చాటుతూ, ఈ నెల 29న కరీంనగర్ జిల్లా అలుగునూర్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మానకొండూర్ నియోజకవర్గంలోని ఇల్లంతకుంట, బెజ్జంకి, గన్నేరువరం, మానకొండూర్, తిమ్మాపూర్, శంకరపట్నం మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి సభ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష చరిత్రను మలుపుతిప్పిన కీలక ఘట్టమని, తరతరాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిందని పేర్కొన్నారు. ఆ ఉద్యమ స్ఫూర్తిని మరోసారి చాటేలా నవంబర్ 29న అలుగునూర్‌లో నిర్వహించనున్న దీక్షా దివస్ భారీ బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో వైఫల్యాలపై బీఆర్ఎస్ నిరసన

అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచినా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని ఆరోపిస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టో పత్రాలను చించి చెత్తబుట్టలో వేసి ప్రభుత్వ వైఫల్యాలపై తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, కరీంనగర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధ వేణు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న లింగాల కమల్ రాజు

ఖమ్మం బ్యూరో, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): చింతకాని మండలంలోని లచ్చగూడెం, నేరడ గ్రామాల్లో నిర్వహించిన నూతన గృహప్రవేశ వేడుకలకు ఖమ్మం జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, మధిర నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి ఇన్‌చార్జి లింగాల కమల్ రాజు హాజరై గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.ముందుగా లచ్చగూడెం గ్రామ భారత రాష్ట్ర సమితి మాజీ శాఖ అధ్యక్షుడు గురిజాల కృష్ణయ్య నూతన గృహప్రవేశ వేడుకకు హాజరై కుటుంబ సభ్యులను అభినందించారు. అనంతరం నేరడ గ్రామ మాజీ ఉపసర్పంచ్ నున్న మల్లికా గోవిందరావు దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమాల్లో చింతకాని మండల భారత రాష్ట్ర సమితి నాయకులు మంకెన రమేష్, గురిజాల హనుమంతరావు, వంకాయలపాటి లచ్చయ్య, గడ్డం శ్రీను, పొనుగోటి రత్నాకర్, పాపినేని రంగారావు, తన్నీరు నాగభూషణం, పిన్నెల్లి శ్రీనుతో పాటు వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కెప్టెన్ లక్ష్మీ కాంతారావుకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

- **పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించిన ఎల్.వి. అర్జున్**

హుజురాబాద్,నవంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు): మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యులు, సీనియర్ రాజకీయ నాయకులు కెప్టెన్ వి. లక్ష్మీకాంతారావు 89వ జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ యూత్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.వి. అర్జున్ ఆయనకు హృదయపూర్వక జన్మదిన



శుభాకాంక్షలు తెలియజేశారు.మంగళవారం హుజురాబాద్ నుంచి హనుమకొండ రోడ్డులోని కెప్టెన్ వి. లక్ష్మీకాంతారావు నివాసానికి వెళ్లిన ఎల్.వి. అర్జున్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా ఎల్.వి. అర్జున్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రిగా, అనంతరం రాజ్యసభ సభ్యుడిగా కెప్టెన్ వి.లక్ష్మీకాంతారావు ప్రజలకు, తెలంగాణ సమాజానికి, ముఖ్యంగా హుజురాబాద్ ప్రాంత అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజా జీవితంలో ఎన్నో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ రాజకీయాల్లో నిబద్ధతకు, విలువలకు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలి

- **42వ డివిజన్‌లో పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ**
- **కొత్త దరఖాస్తుల స్వీకరణ, తిరస్కరణకు గురైన దరఖాస్తుల పునఃపరిశీలనకు విజ్ఞప్తి – యాదగిరి సునీల్ రావు.**

కరీంనగర్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): కరీంనగర్ నగరంలోని 42వ డివిజన్‌లో అర్హులైన చేయూత పింఛన్ లబ్ధిదారులకు మంజూరైన వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళ తదితర పింఛన్ల ప్రొసీడింగ్స్ పత్రాలను బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మేయర్, ప్రస్తుత నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పంపిణీ చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ నగరంలో అనేక మంది వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నూతన వృద్ధాప్య పింఛన్ల దరఖాస్తులను స్వీకరించి, అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల నిర్వహించిన పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియలో వివిధ కారణాలతో కొంతమంది అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి దరఖాస్తులను అధికారులు మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేసి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ వాసులు, పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్ సభ పోస్టర్ ఆవిష్కరణ.. అనుమతుల కోసం బీఆర్ఎస్ నేతల వినతి






- **అలుగునూర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహణకు కలెక్టర్, పోలీస్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు**

కరీంనగర్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): ఈ నెల 29న కరీంనగర్ సమీపంలోని అలుగునూర్‌లో నిర్వహించనున్న దీక్షా దివస్ భారీ బహిరంగ సభకు అనుమతులు మంజూరు చేయాలని బీఆర్ఎస్ నాయకులు జిల్లా అధికారులను కోరారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సభ నిర్వహణకు అవసరమైన అనుమతుల కోసం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌లను వారి కార్యాలయాల్లో కలిసి వినతిపత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఈ నెల 29న అలుగునూర్‌లో నిర్వహించనున్న దీక్షా దివస్ సభకు భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమ అభిమానులు హాజరుకానున్న నేపథ్యంలో సభను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ రమణ, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా, నగర నాయకులు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కొండగట్టు ఆంజనేయస్వామి మహోత్సవాలకు రాష్ట్ర గవర్నర్‌కు ఆహ్వానం

- **గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ఆహ్వాన పత్రిక అందజేసిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

కరీంనగర్, నవంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న స్వామి వారి చందనోత్సవం, మహా సంప్రోక్షణ, నిజరూప దర్శన మహోత్సవ వేడుకలకు హాజరుకావాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆహ్వానించారు. ఈ మేరకు గవర్నర్‌ను కలిసి మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఈ సందర్భంగా కొండగట్టు ఆలయంలో నిర్వహించనున్న ఆధ్యాత్మిక వేడుకల విశిష్టతను వివరించి, మహోత్సవాలకు విచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందాలని గవర్నర్‌ను కోరారు.

ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, కొండగట్టు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావం ఉన్నా.. కరెంటు కోతలు లేకుండా రైతుల పంటలను కాపాడుతున్నాం

- **ఆడబిడ్డల ముఖాల్లో ఆనందం నింపేలా.. రూ. 73 వేలకోట్ల సున్నా వడ్డీ రుణాలిచ్చాం**
- **40 వేల కోట్లతో 8లక్షల ఇందిరమ్మ ఇళ్ళను కట్టిస్తున్నాం**
- **ఈ నెల 19 నుంచి ఇందిరమ్మ ఇళ్ల చీరలను పంపిణీ చేస్తాం**
- **రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **వేంసూరు మండలంలో 686 మందికి నూతన పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ**

ఖమ్మం బ్యూరో, నవంబర్ 17(తెలంగాణ ముచ్చట్లు): తమది పేదల, బడుగు, బలహీన వర్గాల పక్షపాత ప్రభుత్వమని, ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ.. రైతులు వేసిన మొదటి విడత పంటలను కాపాడేందుకు యూనిట్ కరెంటు కు రూ. 15 చొప్పున వెచ్చించేందుకైనా సిద్ధపడి.. కరెంటు కోతలు లేకుండా చూస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి



పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మంగళవారం రాత్రి వేంసూరు హైస్కూల్ ఆవరణలో 686 మందికి నూతన పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, కలెక్టర్ దివాకర.టీఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ లతో కలిసి మంత్రి పొంగులేటి ప్రసంగిస్తూ.. ఒక వేంసూరు మండలంలోనే నెలకు రూ.1.48 కోట్ల మేరకు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం.. పేదింటి ఆడబిడ్డల ముఖాల్లో ఆనందాలు చూడాలని ఇప్పటివరకు రూ. 73 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందజేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు ఇచ్చామని, హైదరాబాద్ లోని పేదల కోసం లక్ష ఇళ్లు కట్టించిఇవ్వబోతున్నామని.. రూ. 40 వేల కోట్ల నిధులతో పేదోడి సొంతింటి కలను సాకారం చేస్తున్నామని అన్నారు.

అప్పటి పాలకులు ఇచ్చిన చీరలను పాలాల్లో పిట్టలు పారిపోయేందుకు కట్టేవారు

ఈనెల 19వ తేదీ నుంచి మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయబోతున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. గత పాలకులు తమ హయాంలో మహిళలకు ఇచ్చిన నాసిరకపు చీరలను... వారి వారి పొలాల్లో పిట్టలు పారిపోయేందుకు పరదాలుగా కట్టే వారని విమర్శించారు. తాము తొలిసారి పాలపిట్ట రంగు చీరలు అందజేశామని, ఈసారి చిలకపచ్చ రంగు చీరలను మహిళలకు ఇవ్వబోతున్నామని తెలిపారు. గత పాలకుల వైఫల్యాలతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతున్నా.. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, మిగిలిన ఒకటి రెండు హామీలను కూడా చిత్తశుద్ధితో కచ్చితంగా అమలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
బుధవారం - 18 - నవంబర్ 2026
వరంగల్ 05

పేదరికాన్ని జయించిన పట్టుదల.. హోంగార్డు ఇంట వైద్య విద్య వెలుగులు!

- **పరిమిత ఆదాయంతో ముగ్గురు పిల్లలను వైద్య విద్య వైపు నడిపించిన గౌస్.. ఎందరికో ఆదర్శం**



జమ్మికుంట, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): పేదరికం చదువుకు అడ్డు కాదని, పట్టుదలతో కష్టపడితే ఎంతటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని జమ్మికుంట పట్టణంలోని ఆబాది జమ్మికుంటకు చెందిన పోలీస్ శాఖ హోంగార్డు ఎస్.కె. గౌస్ నిరూపిస్తున్నారు. సాధారణ హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ వచ్చే పరిమిత ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తూనే, తన ముగ్గురు పిల్లలను ఉన్నత చదువుల వైపు నడిపించి వైద్య విద్యను అభ్యసించే స్థాయికి తీసుకెళ్లారు. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు.. ముగ్గురినీ వైద్య విద్యలో ముందుకు నడిపించడం గౌస్ కుటుంబ ప్రత్యేకతగా నిలుస్తోంది.

కుటుంబ పోషణతో పాటు పిల్లల ఉన్నత చదువుల బాధ్యతను భుజాన వేసుకున్న గౌస్ ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూనే వారి చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా కృషి చేశారు. తన అవసరాలను సైతం పక్కనపెట్టి పిల్లల భవిష్యత్తుకు ప్రాధాన్యతనిచ్చారు. తండ్రి పడిన కష్టం, చేసిన త్యాగాలకు ప్రతిఫలంగా పిల్లలు తమ ప్రతిభతో ఉన్నత విద్యలో రాణిస్తున్నారు.

గౌస్ పెద్ద కుమార్తె ఎస్.కె. హజారా కాకతీయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. రెండో కుమార్తె ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. ఇక ఏకైక కుమారుడు నవాజ్ అలీకి నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు లభించింది. దీంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పిల్లలు వైద్య విద్యలో కొనసాగుతుండటం స్థానికంగా పలువురి ప్రశంసలు అందుకుంటోంది.

సాధారణ ఉద్యోగం చేస్తూ పరిమిత ఆదాయంతోనే పిల్లలను వైద్య విద్య వరకు తీసుకెళ్లడం గౌస్ పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తోంది. సంపద, ఆర్థిక స్థోమత మాత్రమే విజయానికి కొలమానం కాదని, కష్టపడే తత్వం, పట్టుదల, విద్యపై ఆసక్తి ఉంటే పేదరికాన్ని సైతం అధిగమించవచ్చని ఈ కుటుంబం చాటిచెబుతోంది. ఆర్థిక పరిస్థితులు అనుకూలించక ఉన్నత చదువులకు దూరమవుతున్న విద్యార్థులకు, తమ పిల్లలను ఉన్నత స్థానాల్లో చూడాలనుకునే తల్లిదండ్రులకు గౌస్ కుటుంబ ప్రయాణం స్ఫూర్తినిస్తోంది. పిల్లల భవిష్యత్తు కోసం తండ్రి చేసిన నిరంతర శ్రమకు వారి విద్యా ప్రగతే అసలైన ప్రతిఫలంగా నిలుస్తోంది.

పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో పోటీ పడాలి





- **ప్రజలకు సేవ చేయడంలోనే ప్రజాప్రతినిధుల నిజమైన గుర్తింపు**
- **మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్**

జమ్మికుంట, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): ప్రజాప్రతినిధులు పార్టీలకు, రాజకీయ పంతాలకు అతీతంగా ప్రజా సేవకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధిలో పోటీపడాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ సూచించారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు.

జమ్మికుంట పట్టణంలోని ఎంఆర్‌పీఆర్ గార్డెన్స్‌లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో కలిసి జమ్మికుంట పట్టణంతో పాటు పరిసర గ్రామాల లబ్ధిదారులకు నూతన పెన్షన్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని వివిధ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ప్రజల సంక్షేమం, వార్డుల అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అనే రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజల చేత ఎన్నుకోబడిన కౌన్సిలర్లుగా వార్డుల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. పార్టీల మధ్య పోటీ ఉండటం కంటే ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో, అభివృద్ధి పనులు చేపట్టడంలో పోటీ ఉండాలని పేర్కొన్నారు. ప్రజల మన్ననలు పొందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, ఆర్డీవో, ఎంపీడీవో, కౌన్సిలర్లు, మేనేజర్ గుర్రాల రాజిరెడ్డి, ఆర్ఐ భాస్కర్, సర్పంచులు, పెన్షన్ లబ్ధిదారులు, వార్డు అధికారులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెల్టూర్ గ్రామానికి 85 నూతన పింఛన్లు మంజూరు

- **లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



పెద్దమందడి,నవంబర్17(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి 85 నూతన చేయూత పింఛన్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా పెద్దమందడి మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు.ఎన్నో రోజులుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పింఛన్లు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ నవనీత క్యామరాజ్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, బాలచంద్రయ్య, గ్రామ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్, సి వెంకటయ్య, రవీందర్, వడ్డె శేఖర్, వార్డు సభ్యులు నాగభూషణ్, మద్దూర్ వెంకటయ్య, దయ్యాల శేఖర్, దయ్యాల అంజన్న, మిల్లర్ రాజు, నవీన్, బజార్ వెంకటేష్, సాదిక్, పాముల నాగార్జున్, ఇరికి చెట్టి మోహన్, ఎంపీడీవో పరిణత, పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, జిపిఓ వెంకటయ్య గౌడ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



- **ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా.. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా**
- **వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

పెద్దమందడి,నవంబర్17(తెలంగాణ ముచ్చట్లు): ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, తనను గెలిపించిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటూ వారి రుణం తీర్చుకుంటానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు, రేషన్ కార్డులు, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో రోజులుగా పింఛన్లు, రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లతో ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు. ఇందిరా బీమా ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు.వనపర్తి నియోజకవర్గంలో ప్రతినెలా సుమారు రూ.11 కోట్ల పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, 5,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు.సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన పెద్దమందడి రహదారి పనులను త్వరలోనే తిరిగి ప్రారంభించి పూర్తి చేసేందుకు అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీల అధ్యక్షురాలు నవనీత క్యామ రాజు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, సర్పంచ్ గంగా రవీందర్, మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, జిల్లా యువజన అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, రామకృష్ణారెడ్డి, సత్యా రెడ్డి, రమేష్ గౌడ్, మనిగిల్ల తిరుపతి రెడ్డి, ఎంపీడీవో, తహసీల్దార్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వెల్టూర్ గ్రామానికి 85 నూతన పింఛన్లు మంజూరు కావడం హర్షం

- **ఎమ్మెల్యే మేఘారెడ్డి, సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన వార్డు సభ్యురాలు మద్దూరు స్వాతి నరసింహ**

పెద్దమందడి,నవంబర్17(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి 85 నూతన చేయూత పింఛన్లు మంజూరు కావడం పట్ల గ్రామ 7వ వార్డు సభ్యురాలు మద్దూరు స్వాతి నరసింహ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో రోజులుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని, పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటోందని పేర్కొన్నారు. వెల్టూర్ గ్రామానికి 85 నూతన పింఛన్లు మంజూరు చేయడంలో చొరవ చూపిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.



వెల్టూర్ గ్రామానికి 85 నూతన చేయూత పింఛన్లు మంజూరు కావడం హర్షణీయం

- **ఎన్ఎస్‌యూఐ నాయకుడు పి. నాగార్జున**

పెద్దమందడి,నవంబర్17(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి 85 నూతన చేయూత పింఛన్లు మంజూరు కావడం పట్ల భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘమైన నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) నాయకుడు పి. నాగార్జున హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో రోజులుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు పింఛన్లు మంజూరు కావడం సంతోషకరమన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేలా కృషి చేస్తోందని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు చేయూత పింఛన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు.వెల్టూర్ గ్రామానికి 85 నూతన చేయూత పింఛన్లు మంజూరు చేయడంలో చొరవ చూపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి పి. నాగార్జున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



తీగలగుట్టపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- **రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి – మేయర్ కొలగాని శ్రీనివాస్**



కరీంనగర్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరంలోని 2వ డివిజన్ తీగలగుట్టపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ధాన్యాన్ని తూకం వేసి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులైన మేయర్ కొలగాని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్యలను రైతులు, సంఘం నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, నగునూరు సర్పంచ్ సాయిల్ల శ్రావణిమహేందర్, మాజీ జెడ్పీటీసీ కాశెట్టి శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

వెండి పూత పేరుతో స్వీట్లపై అల్యూమినియం కోటింగ్

- కల్తీ వెండి పూతపై సీపీ మహేష్ భగవత్ ఆందోళన
- చార్మినార్ కేంద్రంగా కోటింగ్ తయారీ జరుగుతోందని వెల్లడి
- ప్రముఖ స్వీట్ దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తింపు
- కిడ్నీ, కాలేయ సమస్యలు వచ్చే ప్రమాదమని హెచ్చరిక



హైదరాబాద్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): స్వీట్లపై వెండి పూత పేరుతో ప్రమాదకరమైన అల్యూమినియం కోటింగ్ వినియోగిస్తున్నారని సీపీ మహేష్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. వెండితో తయారైన పూతగా భావించి ప్రజలు కొనుగోలు చేస్తున్న స్వీట్లలో అల్యూమినియం వాడకం జరుగుతోందని హెచ్చరించారు. ఈ తరహా కల్తీపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్‌లోని చార్మినార్ కేంద్రంగా అల్యూమినియం కోటింగ్ తయారీ జరుగుతోందని మహేష్ భగవత్ వెల్లడించారు. అక్కడ తయారవుతున్న పూతను ప్రముఖ స్వీట్ దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. స్వీట్లపై ఆకర్షణీయంగా కనిపించే వెండి రంగు పూత వెనుక అల్యూమినియం వినియోగం ఉండటంపై ఆయన ఆందోళన వెలిబుచ్చారు.

ఈ కోటింగ్ తయారీకి ఉపయోగించే అల్యూమినియం ముడిసరుకు ఉత్తరప్రదేశ్ నుంచి వస్తోందని పేర్కొన్నారు. ముడిసరుకు సరఫరా నుంచి పూత తయారీ, దుకాణాలకు చేరే వరకు జరుగుతున్న వ్యవహారంపై వివరాలు వెల్లడించారు. వెండి పూతగా ప్రచారం చేస్తూ అల్యూమినియం వినియోగించడం ప్రజలను తప్పుదోవ పట్టించే అంశమని స్పష్టం చేశారు.

అల్యూమినియం కోటింగ్ ఉన్న స్వీట్లను తినడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని సీపీ హెచ్చరించారు. ముఖ్యంగా కిడ్నీలు, కాలేయంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల స్వీట్లు కొనుగోలు చేసేటప్పుడు వాటిపై ఉండే పూత విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పండుగలు, శుభకార్యాలు, ఇతర సందర్భాల్లో స్వీట్ల కొనుగోళ్లు చేసే ప్రజలు నాణ్యతపై దృష్టి పెట్టాలని మహేష్ భగవత్ కోరారు. వెండి పూత పేరుతో అల్యూమినియం వినియోగిస్తున్న వ్యవహారంపై ఆయన చేసిన హెచ్చరిక నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది.

పెరుగుతున్న లోన్ యాప్ వేధింపులు

- రూ.25 వేల రుణానికి రూ.5.73 లక్షలు వసూలు
- కాటారానికి చెందిన యువకుడికి రుణ యాప్ నిర్వాహకుల వేధింపులు
- తిరిగి చెల్లించినా ఖాతాలోకి పదేపదే డబ్బుల జమ
- ఫోన్ హ్యాక్ చేసి వ్యక్తిగత ఫొటోలతో బ్లాక్‌మెయిల్
- సైబర్ క్రైమ్, స్థానిక పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



కాటారం, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులకు భూపాలపల్లి జిల్లా కాటారానికి చెందిన ఓ యువకుడు గురైనట్లు ఫిర్యాదు అందింది. తొలుత అత్యవసర అవసరాల కోసం ఓ రుణ యాప్ ద్వారా రూ.25 వేల రుణం తీసుకున్న బాధితుడు, ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించినట్లు సమాచారం. అయినప్పటికీ యాప్ నిర్వాహకుల నుంచి వేధింపులు ఆగలేదని, అధిక వడ్డీ పేరుతో పదేపదే డబ్బులు వసూలు చేసినట్లు బాధితుడు ఆరోపించాడు.

రుణం తిరిగి చెల్లించిన తర్వాత కూడా బాధితుడి బ్యాంకు ఖాతాలోకి నిర్వాహకులు పలుమార్లు డబ్బులు జమ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ మొత్తాలకు అధిక వడ్డీ కలిపి రూ.5 లక్షలకు పైగా బకాయి ఉందంటూ బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపాడు. చెల్లింపు లింక్ పంపించి దానిని తెరవాలని ఒత్తిడి చేయడంతో బాధితుడు ఆ లింక్‌ను ఓపెన్ చేసినట్లు వివరించాడు.

ఆ లింక్ తెరిచిన తర్వాత తన ఫోన్ హ్యాక్ అయినట్లు బాధితుడు గుర్తించినట్లు సమాచారం. ఫోన్‌లోని వ్యక్తిగత ఫొటోలు, వివరాలను దుండగులు సేకరించినట్లు ఆరోపించాడు. అనంతరం అతడి పరిచయస్తుల ఫోన్ నంబర్లకు అసభ్యకర చిత్రాలు పంపుతూ వేధించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వ్యక్తిగత ఫొటోలు, వివరాలను బయటపెట్టి పరువు తీస్తామంటూ బ్లాక్‌మెయిల్ చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఈ బెదిరింపులకు భయపడి విడతల వారీగా రూ.5.70 లక్షలకు పైగా చెల్లించినట్లు వెల్లడించాడు. మొదట తీసుకున్న రుణం రూ.25 వేలే అయినప్పటికీ, వివిధ పేర్లతో భారీ మొత్తాన్ని వసూలు చేశారని ఆరోపించాడు.

వేధింపులు భరించలేక బాధితుడు సైబర్ క్రైమ్ విభాగంతో పాటు స్థానిక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రుణ యాప్ నిర్వాహకుల వేధింపులు, ఫోన్ హ్యాకింగ్, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, డబ్బుల వసూళ్లకు సంబంధించిన అంశాలపై విచారణ కొనసాగిస్తున్నారు.

బాల్యాన్ని బలితీసుకుంటున్న లైంగిక వేధింపులు

- అభం శుభం తెలియని చిన్నారులపై పెరుగుతున్న అఘాయిత్యాలు
- ఇంటా బయటా బాలలకు భద్రత కరువవుతున్న వైనం
- బాధితుల మౌనం నేరస్థులకు ధైర్యంగా మారుతున్న పరిస్థితి
- బాలల రక్షణకు చట్టాలతో పాటు సామాజిక చైతన్యం అవసరం




డెస్క్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): బాల్యం అనేది ప్రతి మనిషి జీవితంలో అత్యంత అందమైన దశ. ఆటపాటలు, అల్లరి, చదువులు, కలలతో సాగాల్సిన ఆ వయసులోకొందరు చిన్నారులు ఊహించని హింసను, లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్నారు. అభం శుభం తెలియని పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు నాగరిక సమాజం తలదించుకునేలా చేస్తున్నాయి. పిల్లలకు రక్షణ కల్పించాల్సిన పెద్దలే కొన్ని సార్లు వారి పాలిట ప్రమాదకరంగా మారుతుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం పిల్లలకు సురక్షిత వాతావరణం కల్పించాల్సి ఉండగా.. అదే వాతావరణంలో చిన్నారులు వేధింపులకు గురవుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. బాలలపై లైంగిక దోపిడీ, వేధింపులు, హింసను అరికట్టడంతో పాటు బాధితులకు న్యాయం, రక్షణ, మానసిక స్వస్థత కల్పించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ నవంబర్ 18న ప్రపంచ బాలల లైంగిక దోపిడీ, వేధింపులు, హింస నివారణ మరియు బాధితుల స్వస్థత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇది కేవలం ఒక అవగాహన దినోత్సవం మాత్రమే కాదు.. పిల్లల భద్రత విషయంలో ప్రభుత్వాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పౌర సమాజం తమ బాధ్యతలను పునఃసమీక్షించుకోవాల్సిన సందర్భం. చిన్నారులపై లైంగిక వేధింపులు ఎప్పుడూ బయటపడకపోవడానికి అనేక కారణాలున్నాయి. తమకు ఎదురైన అనుభవాన్ని ఎలా చెప్పాలో తెలియక కొందరు పిల్లలు మౌనంగా ఉండిపోతారు. మరికొందరు నిందితులు బెదిరించడం, భయపెట్టడం, రహస్యంగా ఉంచాలని ఒత్తిడి చేయడం వల్ల ఎవరికీ చెప్పలేకపోతారు. కుటుంబ పరువు, సమాజం ఏమనుకుంటుందో అనే భయంతో బాధితుల గొంతును నొక్కే ప్రయత్నాలు జరగడం అత్యంత దురదృష్టకరం. వేధింపులకు గురైన పిల్లలను ప్రశ్నించడం, వారినే తప్పుబట్టడం, వారి ప్రవర్తనను అనుమానించడం వంటి చర్యలు వారిని మరింత మానసిక వేదనకు గురిచేస్తాయి. ఇలాంటి సందర్భాల్లో పిల్లలకు అండగా నిలవాల్సిన కుటుంబ సభ్యులే వారిని నమ్మకపోతే న్యాయం పొందే మార్గం మరింత కష్టమవుతుంది. పిల్లలు చెప్పే ప్రతి విషయాన్ని శ్రద్ధగా వినడం, వారి మాటలను విశ్వసించడం, భయపడకుండా సమస్యను బయటపెట్టే వాతావరణం కల్పించడం ఎంతో అవసరం. వేధింపులు ఎదుర్కొన్న చిన్నారుల తప్పేమీ లేదనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలి. నేరానికి పాల్పడిన వ్యక్తినే బాధ్యుడిగా గుర్తించాలి. బాధితుల గౌరవం, గోప్యతను కాపాడుతూ వారికి న్యాయం అందించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది.

పిల్లలకు రక్షణ కల్పించడంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకం. పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారు? ఎక్కడికి వెళ్తున్నారు? ఎవరితో ఎక్కువ సమయం గడుపుతున్నారు? అనే విషయాలను తెలుసుకోవాలి. అయితే వారి స్వేచ్ఛను పూర్తిగా నియంత్రించడం కాకుండా భద్రతపై అవగాహన కల్పించాలి. శరీరానికి సంబంధించిన వ్యక్తిగత హక్కులు, మంచి స్పర్శ, చెడు స్పర్శ, అసౌకర్యంగా అనిపించే ప్రవర్తన గురించి వయసుకు తగిన భాషలో వివరించాలి. ఎవరైనా తమను ఇబ్బంది పెట్టినా, భయపెట్టినా, రహస్యంగా ఉంచాలని చెప్పినా వెంటనే తల్లిదండ్రులకు లేదా నమ్మకమైన పెద్దలకు చెప్పాలని నేర్పించాలి. పిల్లలు చెప్పే విషయాలను మధ్యలో ఆపకుండా వినాలి. వారితో ప్రతిరోజూ కొంత సమయం గడుపుతూ వారి భావాలను తెలుసుకోవాలి. పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లోనూ పిల్లల భద్రతకు సంబంధించిన స్పష్టమైన నిబంధనలు ఉండాలి. ఉపాధ్యాయులు, సిబ్బందికి బాలల రక్షణపై శిక్షణ ఇవ్వాలి. పిల్లలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేసేందుకు ప్రత్యేక ఫిర్యాదు వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. బాలల భద్రత అనేది కేవలం తల్లిదండ్రుల బాధ్యత మాత్రమే కాదు.. పిల్లలతో సంబంధం ఉన్న ప్రతి వ్యవస్థ బాధ్యతగా భావించాలి. ప్రస్తుత కాలంలో డిజిటల్ ప్రపంచం కూడా బాలల భద్రతకు కొత్త సవాళ్లను విసురుతోంది. స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ ఆటలు, వివిధ డిజిటల్ వేదికల వినియోగం పెరగడంతో పిల్లలు తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకునే అవకాశం ఉంది. కొందరు నేరస్థులు నకిలీ గుర్తింపులతో పిల్లలతో స్నేహం చేసి వారి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడం, ఫొటోలు అడగడం, బెదిరించడం, వేధించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. పిల్లల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆన్‌లైన్‌లో వల వేయడం తీవ్రమైన సమస్యగా మారుతోంది. అందువల్ల పిల్లలకు ఇంటర్నెట్ భద్రతపై అవగాహన కల్పించాలి. వ్యక్తిగత వివరాలు, చిరునామా, పాఠశాల సమాచారం, ఫొటోలు వంటి వాటిని అపరిచితులతో పంచుకోకూడదని వివరించాలి. అనుమానాస్పద సందేశాలు, బెదిరింపులు ఎదురైతే వెంటనే పెద్దలకు తెలియజేయాలని చెప్పాలి. తల్లిదండ్రులు పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై బాధ్యతాయుతమైన పర్యవేక్షణ కలిగి ఉండాలి. అదే సమయంలో పిల్లల గోప్యతను, వయసుకు తగిన స్వేచ్ఛను గౌరవించాలి. సాంకేతికతను పూర్తిగా దూరం చేయడం పరిష్కారం కాదు.. దానిని సురక్షితంగా ఉపయోగించుకునేలా పిల్లలను తీర్చిదిద్దడమే అసలైన మార్గం. బాలలపై లైంగిక నేరాలను అరికట్టేందుకు దేశంలో కఠినమైన చట్టాలు ఉన్నప్పటికీ వాటి అమలులో మరింత బాధ్యత అవసరం. లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం (పోక్సో) పిల్లలను లైంగిక నేరాల నుంచి కాపాడేందుకు ప్రత్యేకంగా రూపొందించబడింది. ఈ చట్టం కింద నమోదయ్యే కేసుల్లో బాధిత పిల్లల గౌరవం, గోప్యత, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఫిర్యాదు చేసిన వెంటనే తగిన చర్యలు తీసుకోవడం, విచారణను బాధితులకు ఇబ్బంది కలగకుండా నిర్వహించడం, న్యాయ ప్రక్రియలో పిల్లలపై ఒత్తిడి పడకుండా చూడటం అత్యంత ముఖ్యం. నేరస్థులు ఎంతటి పలుకుబడి కలిగిన వారైనా చట్టం ముందు బాధ్యత వహించాల్సిందే. మరోవైపు బాధిత పిల్లలకు న్యాయం అందించడం అంటే కేవలం నిందితులకు శిక్ష పడటంతోనే పూర్తికాదు. వేధింపుల ప్రభావం పిల్లల మానసిక ఆరోగ్యంపై దీర్ఘకాలం కొనసాగవచ్చు. భయం, ఆందోళన, నిద్రలేమి, ఒంటరితనం, చదువుపై ఆసక్తి తగ్గడం వంటి సమస్యలు ఎదురుకావచ్చు. అందువల్ల వారికి నిపుణుల ద్వారా మానసిక కౌన్సెలింగ్, కుటుంబ సభ్యుల మద్దతు, అవసరమైన వైద్య సహాయం, విద్య కొనసాగించేందుకు తోడ్పాటు అందించాలి. బాధితులను సమాజం చిన్నచూపు చూడకుండా అండగా నిలవాలి. వారి గత అనుభవాలను పదేపదే గుర్తుచేసి మానసికంగా కుంగదీయకుండా సున్నితంగా వ్యవహరించాలి. పిల్లల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావుండకూడదు. చట్టాలు ఎన్ని ఉన్నా ప్రజల్లో చైతన్యం లేకపోతే ఆశించిన ఫలితాలు రావు. ప్రతి ఇంట్లో, ప్రతి పాఠశాలలో, ప్రతి గ్రామంలో బాలల హక్కులు, భద్రతపై చర్చ జరగాలి. పిల్లలు తమకు ఎదురైన అన్యాయాన్ని నిర్భయంగా చెప్పగలిగే వాతావరణం ఏర్పడాలి. అనుమానాస్పద ఘటనలను చూసి కూడా పట్టించుకోకుండా ఉండటం నేరస్థులకు పరోక్షంగా సహకరించినట్లే. పిల్లలపై హింసను గుర్తించినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి. బాలల సహాయవాణి 1098 ద్వారా కూడా సహాయం కోరవచ్చు. బాధితుల వివరాలు, గుర్తింపును బహిర్గతం చేయకుండా వారి గోప్యతను కాపాడాలి. ముఖ్యంగా బాలలపై జరిగే అఘాయిత్యాలను సంచలన వార్తలుగా మాత్రమే చూడకుండా వాటి నివారణకు సమాజం కృషి చేయాలి. పిల్లలు భయంతో కాదు.. భరోసాతో పెరగాలి. అనుమానంతో కాదు.. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. వారి బాల్యాన్ని కాపాడటం ప్రభుత్వాలకే పరిమితమైన బాధ్యత కాదు.. ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత. పిల్లలకు సురక్షితమైన బాల్యాన్ని అందించలేని సమాజం అభివృద్ధి చెందిన సమాజంగా చెప్పుకోలదు. బాలల కన్నీళ్లకు కారణమయ్యే వ్యవస్థలను మార్చి, వారి చిరునవ్వులకు భరోసా ఇచ్చే సమాజాన్ని నిర్మించడమే ఈ దినోత్సవం మనకు అందించే అసలైన సందేశం.

యాంటీబయాటిక్స్ దుర్వినియోగంతో

పెరుగుతున్న ముప్పు..

- ఔషధ నిరోధకతపై అప్రమత్తత అవసరం!
- విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వాడటంతో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలు



డెస్క్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): ఆధునిక వైద్యరంగంలో యాంటీ బయాటిక్స్ అందుబాటులోకి రావడం అనేక ప్రాణాంతక బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ల చికిత్సలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఒకప్పుడు ప్రాణాంతకంగా మారిన అనేక ఇన్ఫెక్షన్లను ఈ మందుల ద్వారా నియంత్రించడం సాధ్యమైంది. అయితే ప్రస్తుతం యాంటీబయాటిక్స్‌ను అవసరం లేకున్నా ఉపయోగించడం, వైద్యుల సలహా లేకుండా మందులు కొనుగోలు చేయడం, చికిత్స మధ్యలోనే ఆపేయడం వంటి అలవాట్లు ప్రపంచవ్యాప్తంగా కొత్త ఆరోగ్య ముప్పును సృష్టిస్తున్నాయి. దీనినే యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ లేదా సూక్ష్మజీవుల ఔషధ నిరోధకతగా పిలుస్తారు. ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం నవంబర్ 18 నుంచి 24 వరకు ప్రపంచ యాంటీ మైక్రోబియల్ నిరోధకత అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. యాంటీబయాటిక్స్‌తో పాటు ఇతర సూక్ష్మజీవ నిరోధక మందులను బాధ్యతాయుతంగా ఉపయోగించాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం తెలియజేస్తుంది. మనిషి ఆరోగ్యానికే కాకుండా జంతువులు, వ్యవసాయం, పర్యావరణంపై కూడా ఈ సమస్య ప్రభావం చూపే అవకాశం ఉండటంతో దీనిని ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్య సమస్యగా గుర్తిస్తున్నారు. యాంటీ మైక్రోబియల్ నిరోధకత అనేది బ్యాక్టీరియా, వైరస్‌లు, శిలీంధ్రాలు, పరాన్నజీవులు వంటి సూక్ష్మజీవులు వాటిని నియంత్రించేందుకు ఉపయోగించే మందులకు తట్టుకునే సామర్థ్యాన్ని పెంచుకోవడం. ముఖ్యంగా బ్యాక్టీరియాపై పనిచేసే యాంటీబయాటిక్స్‌ను తరచూ, అనవసరంగా ఉపయోగించడం వల్ల కొన్ని బ్యాక్టీరియాలు మందులకు లొంగని విధంగా మారుతాయి. ఫలితంగా గతంలో సులభంగా నయమైన ఇన్ఫెక్షన్లకు చికిత్స చేయడం కష్టమవుతుంది. ఒక వ్యక్తి యాంటీ బయాటిక్స్ తీసుకున్నప్పుడు శరీరంలోని అన్ని బ్యాక్టీరియాలు నశించవు. మందులకు సున్నితంగా ఉండే బ్యాక్టీరియాలు తగ్గిపోగా, నిరోధకత కలిగిన బ్యాక్టీరియాలు జీవించి మరింతగా విస్తరించే అవకాశం ఉంటుంది. ఈ నిరోధక బ్యాక్టీరియా ఇతరులకు కూడా వ్యాపించవచ్చు. దీనివల్ల ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులతో పాటు సాధారణ ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా న్యుమోనియా, మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, రక్త సంబంధిత ఇన్ఫెక్షన్లు వంటి సమస్యలకు చికిత్స మరింత సంక్లిష్టంగా మారే ప్రమాదం ఉంది. కొన్ని సందర్భాల్లో ఎక్కువ కాలం చికిత్స అవసరమవడంతో పాటు ఖరీదైన మందులు ఉపయోగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రస్తుతం సమాజంలో యాంటీబయాటిక్స్ వినియోగంపై సరైన అవగాహన లేకపోవడం ఈ సమస్యకు ప్రధాన కారణాల్లో ఒకటిగా మారుతోంది. జలుబు, దగ్గు, గొంతునొప్పి, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే చాలామంది యాంటీబయాటిక్స్ వాడుతున్నారు. వాస్తవానికి సాధారణ జలుబు, చాలా వరకు వైరల్ ఇన్ఫెక్షన్లకు యాంటీబయాటిక్స్ పని చేయవు. ఇవి బ్యాక్టీరియాపై మాత్రమే ప్రభావం చూపుతాయి. అయినప్పటికీ గతంలో ఉపయోగించిన మందులనే మళ్లీ వాడటం, ఇతరులకు ఇచ్చిన మందులను తీసుకోవడం, వైద్యుల సలహా లేకుండా మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు చేయడం వంటి అలవాట్లు కనిపిస్తున్నాయి. కొంతమంది రెండు మూడు రోజులు మందులు వాడిన తర్వాత లక్షణాలు తగ్గగానే చికిత్సను నిలిపివేస్తున్నారు. మరికొందరు మిగిలిపోయిన మాత్రలను భవిష్యత్తులో ఉపయోగించేందుకు దాచుకుంటున్నారు. ఇలాంటి చర్యలు ఔషధ నిరోధకత సమస్యను పెంచే ప్రమాదం ఉంది. యాంటీబయాటిక్స్ ఎప్పుడు అవసరమో, ఏ మందు ఎంత మోతాదులో వాడాలో వైద్యులే నిర్ణయించాలి. ప్రతి జ్వరానికి యాంటీబయాటిక్ అవసర మనే అపోహను ప్రజలు విడిచిపెట్టాలి.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
బుధవారం - 18 - నవంబర్ 2026

ప్రకృతి వైద్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం.. సహజ జీవనమే ఆరోగ్యానికి అసలైన పునాది!

- ప్రకృతికి దగ్గరగా ఉంటే ఆరోగ్యానికి మేలు
- యోగా, ధ్యానం, వ్యాయామంతో శారీరక, మానసిక దృఢత్వం
- సమతుల్య ఆహారం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలికి ప్రాధాన్యం
- మందులపై ఆధారపడే పరిస్థితులు రాకుండా ముందస్తు ఆరోగ్య జాగ్రత్తలు



డెస్క్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): ఆరోగ్యమే మహాభాగ్యం.. ఈ మాట ప్రతి ఒక్కరికీ తెలిసినప్పటికీ ప్రస్తుత జీవన విధానంలో ఆరోగ్యానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేకపోతున్నారు. ఉరుకుల పరుగుల జీవితం, పని ఒత్తిడి, సమయానికి ఆహారం తీసుకోకపోవడం, శారీరక శ్రమ తగ్గిపోవడం, నిద్రలేమి వంటి కారణాలతో అనేక ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. చిన్న వయసులోనే మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, గుండె సంబంధిత సమస్యలు ఎదురవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. అనారోగ్యం వచ్చిన తర్వాత ఆసుపత్రులు, మందులపై ఆధారపడటం కంటే ముందుగానే ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో ప్రకృతి వైద్యం, సహజ జీవన విధానాల ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేసేందుకు ప్రతి సంవత్సరం నవంబర్ 18న జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రకృతిలో లభించే వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించాలనే సందేశాన్ని ఈ రోజు అందిస్తుంది. ప్రకృతి వైద్యం అనేది కేవలం అనారోగ్య సమస్యలకు చికిత్స అందించే విధానం మాత్రమే కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమైన అలవాట్లు, ఆహార నియమాలు, శారీరక వ్యాయామం, మానసిక ప్రశాంతత వంటి అంశాలను కలిపిన జీవన విధానం.

ప్రకృతి వైద్యంలో శరీరానికి సహజంగా స్వస్థత పొందే సామర్థ్యం ఉందనే భావనకు ప్రాధాన్యం ఇస్తారు. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు గాలి, నీరు, సూర్యరశ్మి, మట్టి, విశ్రాంతి, సమతుల్య ఆహారం వంటి సహజ అంశాలను తగిన విధంగా వినియోగించుకోవాలని సూచిస్తారు. ప్రకృతి వైద్య విధానంలో ఆహార నియమాలు, ఉపవాసం వంటి పద్ధతులు, యోగా, ధ్యానం, శ్వాసాభ్యాసాలు, శారీరక వ్యాయామాలకు ప్రాధాన్యం ఉంటుంది. అయితే ప్రతి ఒక్కరి శరీర తత్వం, వయసు, ఆరోగ్య పరిస్థితి వేర్వేరుగా ఉంటాయి. అందువల్ల ప్రకృతి వైద్య చికిత్సలను నిపుణుల పర్యవేక్షణలోనే అనుసరించాలి. సహజమైన పద్ధతుల పేరుతో శాస్త్రీయంగా నిరూపితమైన వైద్య చికిత్సలను నిలిపివేయడం సరైన విధానం కాదు. ప్రకృతి వైద్యం ద్వారా ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవడంతో పాటు అవసరమైనప్పుడు ఆధునిక వైద్య సేవలను కూడా పొందడం ముఖ్యం. శరీరానికి ఏది అవసరమో గుర్తించి దానికి అనుగుణంగా జీవనశైలిని మార్చుకోవడం ఈ విధానంలోని ప్రధాన ఉద్దేశం.

ప్రకృతి వైద్యంలో ఆహారానికి అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. మనం ప్రతిరోజూ తీసుకునే ఆహారమే శరీరానికి శక్తిని అందించడంతో పాటు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ప్రస్తుతం చాలామంది సమయం లేకపోవడం, రుచికి అలవాటు పడటం వంటి కారణాలతో ప్యాకేజ్డ్ ఆహారం, జంక్‌ఫుడ్, అధిక నూనెతో తయారుచేసిన పదార్థాలు, చక్కెర ఎక్కువగా ఉండే పానీయాలను తీసుకుంటున్నారు. వీటిని తరచూ తీసుకోవడం వల్ల శరీరంలో అనవసరమైన కొవ్వు పెరగడం, బరువు నియంత్రణ తప్పడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. వీటికి బదులుగా ఆకుకూరలు, కూరగాయలు, తాజా పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, తగిన మోతాదులో ప్రోటీన్ అందించే పదార్థాలను ఆహారంలో చేర్చుకోవాలి. భోజన సమయాలను పాటించడం, అతిగా తినకుండా ఉండటం, తగినంత నీరు తాగడం కూడా ముఖ్యమే. ఉదయం అల్పాహారాన్ని నిర్లక్ష్యం చేయకుండా, మధ్యాహ్నం సమతుల్య భోజనం తీసుకుని, రాత్రి తేలికపాటి ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. ఆహారాన్ని నెమ్మదిగా నమిలి తినడం, ఆకలి స్థాయిని గుర్తించడం వంటి చిన్న అలవాట్లు కూడా ఆరోగ్య పరిరక్షణలో ఉపయోగపడతాయి. ప్రకృతి వైద్యం సూచించే ఆహార నియమాలను పాటించేటప్పుడు వ్యక్తిగత పోషక అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో అవసరం. ఈ విషయంలో యోగా, ప్రాణాయామం, ధ్యానం కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతిరోజూ కొంత సమయం యోగాసనాలకు కేటాయించడం వల్ల శరీర కదలికలు మెరుగుపడటంతో పాటు కండరాల సౌలభ్యం, శారీరక సమతుల్యత పెరుగుతాయి. ప్రాణాయామం ద్వారా శ్వాసపై నియంత్రణ సాధించడానికి, ధ్యానం ద్వారా మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పని ఒత్తిడి, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక సమస్యలు, పోటీ ప్రపంచం కారణంగా మానసిక ఆందోళన ఎదుర్కొంటున్న వారికి విశ్రాంతి పద్ధతులు ఉపయోగపడతాయి. రోజులో కొంత సమయం ఫోన్, కంప్యూటర్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు దూరంగా గడపడం, ప్రకృతిలో నడవడం, మొక్కల మధ్య సమయం గడపడం, ఇష్టమైన పనులు చేయడం మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయి. ప్రతిరోజూ కనీసం కొంత సమయం నడకకు కేటాయించడం, శరీర సామర్థ్యానికి అనుగుణంగా వ్యాయామం చేయడం, ఎక్కువసేపు ఒకేచోట కూర్చోకుండా మధ్యమధ్యలో కదలడం కూడా అవసరం. వ్యాయామం చేయడం అంటే కేవలం బరువులు ఎత్తడం లేదా కఠినమైన కసరత్తులు చేయడం మాత్రమే కాదు. నడక, సైక్లింగ్, ఈత, యోగా వంటి కార్యకలాపాలను కూడా దినచర్యలో భాగం చేసుకోవచ్చు.

ప్రకృతి వైద్యంలో నీరు, గాలి, సూర్యరశ్మి, విశ్రాంతి వంటి అంశాలకు కూడా ప్రత్యేక స్థానం ఉంది. శరీరానికి తగినంత నీరు అందించడం ద్వారా సాధారణ శరీర విధులు సక్రమంగా కొనసాగుతాయి. స్వచ్ఛమైన గాలి అందే వాతావరణంలో గడపడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, సాధ్యమైనంత వరకు పచ్చదనానికి దగ్గరగా ఉండటం ఆరోగ్యకరమైన జీవనానికి తోడ్పడతాయి. ఉదయపు సూర్యరశ్మి ద్వారా శరీరానికి విటమిన్ డి అందే అవకాశం ఉంటుంది. అయితే ఎండ తీవ్రతను బట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మరోవైపు నిద్రను చాలామంది నిర్లక్ష్యం చేస్తున్నారు. రాత్రివేళ ఆలస్యంగా నిద్రపోవడం, పడుకునే ముందు ఎక్కువసేపు ఫోన్ చూడటం, పని ఒత్తిడిని ఇంటి వరకు తీసుకురావడం వల్ల నిద్ర నాణ్యత తగ్గుతోంది. పెద్దలకు సాధారణంగా రోజుకు ఏడు నుంచి తొమ్మిది గంటల నిద్ర అవసరం. తగినంత నిద్ర శరీరానికి విశ్రాంతిని అందించడంతో పాటు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మానసిక స్థిరత్వానికి తోడ్పడుతుంది. కాబట్టి ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, ఒకే సమయానికి మేల్కొనడం వంటి అలవాట్లు పెంపొందించుకోవాలి. శరీరానికి విశ్రాంతి ఇవ్వడం కూడా ఆరోగ్య పరిరక్షణలో భాగమేనని గుర్తించాలి.

ప్రస్తుత సమాజంలో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం అనేక లోపాలు కనిపిస్తున్నాయి. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు మాత్రమే ఆహార నియమాలు, వ్యాయామం గురించి ఆలోచించడం కాకుండా చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించాలి. పిల్లలకు పోషకాహారం, ఆటలు, శారీరక శ్రమ ప్రాధాన్యాన్ని తెలియజేయాలి. పెద్దలు కూడా తమ రోజువారీ పనుల్లో ఆరోగ్యానికి కొంత సమయం కేటాయించాలి. మద్యపానం, పొగాకు వినియోగం, అతిగా ప్రాసెస్ చేసిన ఆహారం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలి. అధిక బరువు, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు వంటి అంశాలను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలి. ఏదైనా అనారోగ్య లక్షణం కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. ప్రకృతి వైద్యం పేరుతో అన్ని వ్యాధులూ నయమవుతాయని భావించడం, అవసరమైన మందులు మానేయడం, వైద్యుల సూచనలు పాటించకపోవడం ప్రమాదకరం. సహజ జీవన విధానాలను శాస్త్రీయ వైద్య సలహాలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి. జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవం అందించే అసలైన సందేశం కూడా ఇదే. ప్రకృతికి అనుగుణంగా జీవించడం, ఆహారంలో క్రమశిక్షణ పాటించడం, శారీరక శ్రమకు ప్రాధాన్యం ఇవ్వడం, మానసిక ప్రశాంతతను కాపాడుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి. ఆరోగ్యం అనేది ఒక్క రోజులో సంపాదించేది కాదు.. ప్రతిరోజూ మనం పాటించే మంచి అలవాట్లతో నిర్మించుకునే సంపద.

కథువాలో రూ.9.07 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం




- ఆరు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన ముఖ్యమంత్రి
- లఖన్‌పూర్ తాగునీటి పథకానికి ప్రారంభం
- జమ్మూ కశ్మీర్‌కు ముఖద్వారంగా కథువాకు ప్రాధాన్యం
- స్థానిక ఉపాధి, యువత నైపుణ్యాభివృద్ధికి కొత్త పారిశ్రామిక విధానం

కథువా, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): జమ్మూ కశ్మీర్‌లోని కథువా ప్రాంతంలో ముఖ్యమంత్రి పర్యటించి రూ.9.07 కోట్ల విలువైన ఆరు అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. వీటిలో లఖన్‌పూర్ తాగునీటి సరఫరా పథకాన్ని ప్రారంభించడంతోపాటు మరో ఐదు ప్రజాప్రయోజన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ జమ్మూ కశ్మీర్‌కు కథువా ముఖద్వారంగా ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలను విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.

రాబోయే నూతన పారిశ్రామిక విధానంలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. దీనివల్ల జమ్మూ కశ్మీర్ యువతకు మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు.

కథువా ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించినట్లు సభలో ప్రస్తావించారు. తాగునీటి సరఫరా పథకంతో పాటు ఇతర ప్రజాప్రయోజన పనులు స్థానికులకు ఉపయోగపడనున్నాయి. ఈ ప్రాజెక్టుల అమలుతో ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌధరి, మంత్రి జావెద్ దార్, ముఖ్యమంత్రి సలహాదారు నాసిర్ సోగామి, కథువా ఎమ్మెల్యే డాక్టర్ భరత్ భూషణ్ పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు.

క్వాడ్ సదస్సులో పాల్గొన్న ప్రధాని మోదీ




- మనీలాలో ఏడో క్వాడ్ నేతల శిఖరాగ్ర సమావేశం
- అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా నేతలతో సమావేశం
- ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, సౌభాగ్యానికి ఉమ్మడి కృషి
- 2027లో ముంబైలో తొలి క్వాడ్ వ్యాపార నేతల వేదిక

మనీలాలో, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): మనీలాలో జరిగిన ఏడో క్వాడ్ నేతల శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జపాన్ ప్రధాని సనాయే తకాయిచి, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి సమావేశానికి హాజరయ్యారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, ఆర్థికాభివృద్ధికి సంబంధించిన అంశాలపై నేతలు చర్చించారు. క్వాడ్ భాగస్వామ్యాన్ని నిర్మాణాత్మకంగా, విశ్వసనీయంగా ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. ప్రాంతీయంగా శాంతి, సౌభాగ్యం, స్థిరత్వాన్ని పెంపొందించడంలో నాలుగు దేశాల సహకారం కీలకమని పేర్కొన్నారు. పరస్పర విశ్వాసంతో ఉమ్మడి లక్ష్యాల సాధనకు కృషి చేయాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. సముద్ర భద్రత, ఆర్థిక భద్రత, కీలక సాంకేతిక పరిజ్ఞానాలు, విపత్తుల సమయంలో స్పందన వంటి రంగాల్లో సహకారాన్ని విస్తరించడంపై సమావేశంలో దృష్టి సారించారు. ఇండో పసిఫిక్ ప్రాంత దేశాలకు ప్రయోజనం చేకూర్చేలా ఈ రంగాల్లో సమన్వయంతో ముందుకు సాగాలని మోదీ ఆకాంక్షించారు. ప్రాంతీయ సవాళ్లను ఎదుర్కోవడంలో ఉమ్మడి కార్యాచరణకు ప్రాధాన్యం ఇచ్చారు.

ఈ సందర్భంగా 2027లో ముంబైలో తొలి క్వాడ్ వ్యాపార నేతల వేదికను నిర్వహించనున్నట్లు ప్రధాని ప్రకటించారు. నాలుగు దేశాల వ్యాపార రంగ ప్రముఖులు ఒకచోట చేరి పరస్పర సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు ఈ వేదిక అవకాశం కల్పించనుంది. ఆర్థిక సహకారాన్ని మరింత విస్తరించడంలో వ్యాపార రంగ భాగస్వామ్యం కీలకంగా నిలవనుంది. క్వాడ్ భవిష్యత్తు పాత్రపై మోదీ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అభివృద్ధి ప్రయాణంలో భాగస్వామిగా, సంక్షోభ సమయాల్లో మిత్రుడిగా, భవిష్యత్తుపై విశ్వాసాన్ని కలిగించే వేదికగా క్వాడ్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో ఉమ్మడి ప్రయోజనాలను కాపాడుతూ శాంతి, అభివృద్ధి దిశగా నాలుగు దేశాలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో మోదీ భేటీ

- మనీలాలో ఆసియాన్-భారత్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా సమావేశం
- సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య అమలుపై సమీక్ష
- ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై ఇరువురు నేతల చర్చ
- సింగపూర్ ఆసియాన్ అధ్యక్ష బాధ్యతలకు భారత్ మద్దతు



న్యూఢిల్లీ, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): ప్రధాని నరేంద్ర మోదీ మనీలాలో సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో సమావేశమయ్యారు. ఆసియాన్‌భారత్ శిఖరాగ్ర సదస్సు, తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో భారత్, సింగపూర్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, పరస్పర సహకారానికి సంబంధించిన అంశాలపై చర్చించారు.ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య అమలుపై మోదీ, లారెన్స్ వాంగ్ సమీక్షించారు. ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాల పురోగతిని పరిశీలిస్తూ, భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. రెండు దేశాల మధ్య ఉన్న సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా చర్చలు సాగాయి. సమావేశంలో ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా ఇరువురు నేతలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఆసియాన్ ప్రాంతంతో భారత్‌కు ఉన్న సంబంధాలు, ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో పరస్పర సహకారం వంటి అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ భేటీ ఆసియాన్‌భారత్ సదస్సు నేపథ్యంలో రెండు దేశాల మధ్య ఉన్న దౌత్య సంబంధాల ప్రాధాన్యాన్ని మరోసారి ప్రతిబింబించింది.

త్వరలో సింగపూర్ ఆసియాన్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ప్రధాని లారెన్స్ వాంగ్‌కు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఆ బాధ్యతల నిర్వహణలో సింగపూర్‌కు భారత్ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఆసియాన్ వ్యవహారాల్లో సింగపూర్ చేపట్టబోయే నాయకత్వానికి భారత్ సహకరించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

మనీలాలో జరిగిన ఈ సమావేశంలో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య పురోగతితో పాటు ప్రాంతీయ, ప్రపంచ పరిణామాలపై చర్చించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సింగపూర్ తదుపరి ఆసియాన్ అధ్యక్ష బాధ్యతలకు భారత్ మద్దతు ప్రకటించడం ద్వారా ఇరు దేశాల మధ్య దౌత్య సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఆసక్తి వ్యక్తమైంది.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

2027–28 కేంద్ర బడ్జెట్‌పై తయారీ రంగం నిపుణులతో నిర్మలా సీతారామన్ సంప్రదింపులు

- మూడో విడత ముందస్తు బడ్జెట్ సమావేశానికి ఆర్థిక మంత్రి అధ్యక్షత
- తయారీ రంగ నిపుణులు, ప్రతినిధులతో చర్చలు
- ఆర్థిక, పరిశ్రమలు, గనులు, కార్పొరేట్ వ్యవహారాల శాఖల కార్యదర్శుల హాజరు
- కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు కూడా పాల్గొన్నారు



న్యూఢిల్లీ, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): రానున్న 2027-28 కేంద్ర బడ్జెట్ రూపకల్పనకు సంబంధించి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మూడో విడత ముందస్తు బడ్జెట్ సంప్రదింపుల సమావేశానికి అధ్యక్షత వహించారు. న్యూఢిల్లీలో మంగళవారం తయారీ రంగానికి చెందిన నిపుణులు, ప్రముఖులతో ఈ సమావేశం నిర్వహించారు. బడ్జెట్ రూపకల్పనలో వివిధ రంగాల అభిప్రాయాలను తెలుసుకునే ప్రక్రియలో భాగంగా ఈ సంప్రదింపులు చేపట్టారు.

తయారీ రంగానికి చెందిన నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రానున్న కేంద్ర బడ్జెట్‌లో తయారీ రంగానికి సంబంధించిన అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు సమావేశం నిర్వహించారు. ఈ రంగానికి చెందిన ప్రముఖులతో ఆర్థిక మంత్రి సంప్రదింపులు జరిపారు.

సమావేశానికి ఆర్థిక వ్యవహారాల శాఖ, పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం, గనుల శాఖ, కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శులు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ 2027-28కు సంబంధించి ముందస్తు సంప్రదింపుల కార్యక్రమంలో భాగంగా తయారీ రంగానికి ప్రాధాన్యం కలిగిన అంశాలపై ఈ సమావేశం నిర్వహించారు. వివిధ రంగాల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి వారి సూచనలు, అభిప్రాయాలను బడ్జెట్ రూపకల్పన ప్రక్రియలో పరిగణనలోకి తీసుకునే దిశగా కేంద్ర ఆర్థిక శాఖ ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది.

మూడో విడత సంప్రదింపుల సమావేశంలో తయారీ రంగ నిపుణులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొనడం ద్వారా బడ్జెట్ రూపకల్పనకు సంబంధించిన చర్చలు కొనసాగాయి. సమావేశంలో పాల్గొన్న వారి సూచనల వివరాలు, చర్చించిన నిర్దిష్ట అంశాలు మాత్రం అధికారిక ప్రకటనలో వెల్లడించలేదు.

ఆసియాన్ దేశాలతో సహకార బలోపేతానికి ఐదు కీలక కార్యక్రమాలు ప్రకటించిన మోదీ

- మనీలా వేదికగా 23వ ఆసియాన్–భారత్ శిఖరాగ్ర సదస్సు
- సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య పురోగతిపై నేతల సమీక్ష
- సముద్ర, అంతరిక్ష, కీలక ఖనిజ రంగాల్లో సహకారానికి ప్రణాళికలు
- ఆసియాన్ పర్యాటకులకు ఉచిత ఈ-వీసాల ప్రకటన



న్యూఢిల్లీ, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో నిర్వహించిన 23వ ఆసియాన్-భారత్ శిఖరాగ్ర సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసియాన్ దేశాల ఐక్యత, కేంద్రస్థానానికి భారత్ సంపూర్ణ మద్దతు కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు. శాంతియుత, స్వేచ్ఛాయుత, సమ్మిళిత ఇండోపసిఫిక్ ప్రాంతం నిర్మాణమే భారత్, ఆసియాన్ దేశాల ఉమ్మడి లక్ష్యమని స్పష్టం చేశారు.

భారత్-ఆసియాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఇప్పటివరకు సాధించిన పురోగతిని మోదీ, ఆసియాన్ దేశాల నేతలు సమీక్షించారు. వివిధ రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించే మార్గాలపై చర్చించారు. ప్రాంతీయ శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి పరస్పర భాగస్వామ్యం కీలకమనే ఉమ్మడి దృక్పథాన్ని నేతలు ఈ సమావేశంలో వెల్లడించారు.


2026ను ఆసియాన్-భారత్ సముద్ర సహకార సంవత్సరంగా నిర్వహించేందుకు చేపట్టిన కార్యక్రమాలను నేతలు ప్రశంసించారు. ఈ సహకారాన్ని దీర్ఘకాలికంగా కొనసాగించేందుకు ప్రత్యేక సముద్ర సహకార ప్రణాళికను మోదీ ప్రకటించారు. అంతరిక్ష రంగంలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఆసియాన్-భారత్ అంతరిక్ష హ్యాకథాన్ నిర్వహణతో పాటు కీలక ఖనిజాల రంగంలో పరస్పర సహకారాన్ని పెంపొందించే కార్యక్రమాలను కూడా వెల్లడించారు.

విద్యా రంగంలో సంబంధాలను బలోపేతం చేసేందుకు నలంద విశ్వవిద్యాలయంలో ఆసియాన్ దేశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల సంఖ్యను విస్తరించనున్నట్లు మోదీ ప్రకటించారు. దీంతో ఆయా దేశాల విద్యార్థులకు భారతదేశంలో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాలు మరింత పెరగనున్నాయి. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే దిశగా ఆసియాన్ దేశాల పర్యాటకులకు ఉచిత ఈ వీసాలు అందించనున్నట్లు తెలిపారు.

సముద్ర సహకార దీర్ఘకాలిక ప్రణాళిక, అంతరిక్ష హ్యాకథాన్, కీలక ఖనిజాల రంగంలో భాగస్వామ్యం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల విస్తరణ, ఉచిత ఈవీసాలు వంటి ఐదు కార్యక్రమాల ద్వారా భారత్-ఆసియాన్ సంబంధాలను మరింత బలోపేతం చేయాలని మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమాలు వాణిజ్యం, సాంకేతికత, విద్య, పర్యాటకం తదితర రంగాల్లో పరస్పర సహకారానికి కొత్త అవకాశాలను కల్పించనున్నాయి.

కచ్ భూకంప పునర్నిర్మాణ అనుభవాలు.. సుపరిపాలనకు కీలక పాఠాలు

- నీతి ఆయోగ్ జాతీయ సదస్సులో రాజీవ్ టోప్నో ప్రసంగం
- భుజ్ పునర్నిర్మాణంలో నాలుగు కీలక అంశాల ప్రస్తావన
- ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ సహకారంతో పునర్నిర్మాణం



న్యూఢిల్లీ, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): 2001లో కచ్ ప్రాంతాన్ని కుదిపేసిన భూకంపం అనంతరం భుజ్ నగరం పునర్నిర్మాణం సాధించిన తీరును గుజరాత్ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి రాజీవ్ టోప్నో వివరించారు. నీతి ఆయోగ్ నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ఈ అనుభవాలను ప్రస్తావించారు. భూకంపం తర్వాత సాధారణ పరిస్థితులను పునరుద్ధరించడమే కాకుండా, ప్రజల భాగస్వామ్యం, సంస్థాగత బలోపేతం ద్వారా కొత్త పరిస్థితులను సృష్టించగలిగామని తెలిపారు. కచ్ పునర్నిర్మాణ ప్రయాణంలో నాలుగు అంశాలు కీలక పాత్ర పోషించాయని రాజీవ్ టోప్నో వివరించారు. స్పష్టమైన దార్శనికతతో పాటు నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడం, ఐక్యతతో పనిచేయడం, నిబద్ధతను ప్రదర్శించడం మొదటి రెండు అంశాలుగా పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యానికి ప్రభుత్వ సహకారం తోడవడం, దీర్ఘకాలికంగా పనిచేసే సంస్థలను నిర్మించడం మిగిలిన రెండు కీలక అంశాలని వివరించారు.

పరిపాలనలో సమర్థత సాధించేందుకు స్పష్టమైన లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలని ఆయన సూచించారు. నిర్ణయాలు తీసుకోవడంలో వేగం అవసరమైనప్పటికీ, వాటికి జవాబుదారీతనం కూడా తోడవ్వాలని పేర్కొన్నారు. ప్రజల సామర్థ్యంపై నమ్మకం ఉంచి, వారిని అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములను చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వివరించారు.

సంక్షోభాలను కేవలం సమస్యలుగా చూడకుండా, వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు తీసుకురావడానికి అవకాశాలుగా మలచుకోవాలని రాజీవ్ టోప్నో అభిప్రాయపడ్డారు. కచ్ భూకంపం తర్వాత చేపట్టిన పునర్నిర్మాణం ఇందుకు ఉదాహరణగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యం, బలమైన సంస్థాగత వ్యవస్థ, సమష్టి సంకల్పం పునర్నిర్మాణానికి పునాదులుగా నిలిచాయని వివరించారు. 2001 కచ్ పునర్నిర్మాణం పాత పరిస్థితులను తిరిగి తీసుకురావడానికే పరిమితం కాలేదని, కొత్త ప్రమాణాలతో అభివృద్ధి దిశగా సాగిందని ఆయన పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో చేపట్టిన కార్యక్రమాలు, సంస్థల నిర్మాణం, సమష్టి కృషి ఈ ప్రయాణంలో కీలకంగా నిలిచాయని తెలిపారు. ఈ అనుభవాలు ప్రస్తుత పరిపాలనా వ్యవస్థలకు కూడా ఉపయోగపడే పాఠాలను అందిస్తున్నాయని రాజీవ్ టోప్నో వివరించారు.



బెంగళూరులో తొలి కామన్వెల్త్ మహిళా పార్లమెంటేరియన్ల ప్రాంతీయ సదస్సు ప్రారంభం

- విధానసౌధలో సదస్సును ప్రారంభించిన ఓం బిర్లా, డీకే శివకుమార్
- రెండు రోజుల పాటు కొనసాగనున్న సమావేశాలు
- మహిళా నాయకత్వం, ప్రాతినిధ్య బలోపేతంపై చర్చలు
- ప్రజాస్వామ్య వ్యవస్థల్లో మహిళల భాగస్వామ్యానికి ప్రాధాన్యం

బెంగళూరు, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): కర్ణాటక రాజధాని బెంగళూరులోని చారిత్రక విధానసౌధలో తొలి కామన్వెల్త్ మహిళా పార్లమెంటేరియన్ల (సీడబ్ల్యూపీ) భారత ప్రాంతీయ సదస్సు ప్రారంభమైంది. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సంయుక్తంగా సదస్సును ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ సమావేశానికి మహిళా పార్లమెంటు సభ్యులు, వివిధ రాష్ట్రాల శాసనసభ్యులు హాజరవుతున్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థల్లో మహిళల నాయకత్వాన్ని బలోపేతం చేయడం, చట్టసభల్లో వారి ప్రాతినిధ్యాన్ని పెంపొందించడం, నిర్ణయాత్మక ప్రక్రియల్లో అర్థవంతమైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. మహిళా ప్రజాప్రతినిధులు తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు, నాయకత్వ అవకాశాలు, ప్రజాస్వామ్య సంస్థల్లో మహిళల పాత్రకు సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు.

ప్రారంభ సమావేశానికి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డాక్టర్ జి. పరమేశ్వర హాజరయ్యారు. కర్ణాటక శాసన సభ స్పీకర్ జి.ఎస్. పాటిల్, సీడబ్ల్యూపీ భారత ప్రాంతీయ అధ్యక్షురాలు డాక్టర్ డి. పురందేశ్వరి కూడా పాల్గొన్నారు. వీరితో పాటు కర్ణాటక శాసనమండలి చైర్మన్ సలీం అహ్మద్ సమావేశానికి హాజరయ్యారు.

కర్ణాటక శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఉమాశ్రీ, శాసనసభ డిప్యూటీ స్పీకర్ మంకల్ వైద్య కూడా ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ స్థాయిల్లో ప్రజాప్రతినిధులుగా పనిచేస్తున్న మహిళలకు పరస్పర అనుభవాల మార్పిడికి ఈ సదస్సు వేదికగా నిలవనుంది. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం, నాయకత్వ సామర్థ్యాల పెంపు వంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రాంతీయ సదస్సులో మహిళా ప్రజాప్రతినిధుల పాత్ర, ప్రజాస్వామ్య సంస్థల్లో వారి భాగస్వామ్యాన్ని మరింత విస్తరించే అంశాలపై చర్చలు కొనసాగనున్నాయి. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడం, చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యానికి తోడ్పడే మార్గాలను అన్వేషించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలను మరింత సమ్మిళితంగా తీర్చిదిద్దడమే ఈ సమావేశం ఉద్దేశంగా ఉంది.

గురుదాస్‌పూర్‌లో పోలీస్ హెడ్ కానిస్టేబుల్ హత్య..

- మన్‌కౌర్ బైపాస్ సమీపంలో వినోద్ కుమార్ మృతదేహం
- తలలో బుల్లెట్ గాయాన్ని గుర్తించిన పోలీసులు
- బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తుల కోసం గాలింపు
- 'ఆపరేషన్ నూర్' పేరుతో దాడి చేశామంటూ సంస్థ ప్రకటన

గురుదాస్‌పూర్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు): పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌లో పోలీస్ శాఖలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ వినోద్ కుమార్ హత్యకు గురయ్యారు. 42 ఏళ్ల ఆయన మృతదేహం ఆదివారం రాత్రి మన్‌కౌర్ బైపాస్ సమీపంలో కనిపించింది. తలలో బుల్లెట్ గాయం ఉండటాన్ని గుర్తించిన పోలీసులు హత్య జరిగినట్లు నిర్ధారించారు. ఈ ఘటనతో స్థానికంగా కలకలం రేగింది. హత్యకు గల కారణాలు, నిందితుల వివరాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఘటనకు ముందు ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి వినోద్ కుమార్‌కు లిఫ్ట్ ఆఫర్ చేసినట్లు సీసీటీవీ దృశ్యాల్లో కనిపించినట్లు సమాచారం. ఆ తర్వాత ఆయన కనిపించకుండా పోయారు. కొంతసేపటికి బైపాస్ సమీపంలో బుల్లెట్ గాయంతో మృతదేహంగా కనిపించడంతో ఈ దృశ్యాలు దర్యాప్తులో కీలకంగా మారాయి. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్న పోలీసులు బైక్‌పై వచ్చిన వ్యక్తుల కదలికలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

మరోవైపు 'తెహ్రీక్ఎతాలిబన్ హిందుస్థాన్' అనే సంస్థ ఈ హత్యకు తామే బాధ్యులమంటూ ప్రకటన విడుదల చేసినట్లు సమాచారం. 'ఆపరేషన్ నూర్' పేరుతో దాడికి పాల్పడినట్లు అందులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో మరిన్ని దాడులు చేస్తామని కూడా హెచ్చరించినట్లు సమాచారం. ఈ ప్రకటన వెలువడటంతో కేసులో ఉగ్రవాద కోణం తెరపైకి వచ్చింది.

అయితే సంస్థ విడుదల చేసిన ప్రకటనలోని నిజానిజాలను పంజాబ్ పోలీసులు ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది. కేవలం ప్రకటన ఆధారంగా హత్య వెనుక సంస్థ పాత్రను నిర్ధారించలేని పరిస్థితి నెలకొంది. ప్రకటన చేసిన సంస్థ వివరాలు, దాని వాదనలకు సంబంధించిన ఆధారాలను కూడా దర్యాప్తు అధికారులు పరిశీలించాల్సి ఉంది. మరోవైపు సీసీటీవీ దృశ్యాలు, ఇతర ఆధారాల ఆధారంగా నిందితులను గుర్తించే ప్రయత్నం కొనసాగుతోంది. హెడ్ కానిస్టేబుల్ హత్యకు సంబంధించి అన్నికోణాల్లో విచారణ చేపట్టినట్లు సమాచారం. వ్యక్తిగత కక్షలు, ఇతర కారణాలతో పాటు ఉగ్రవాద సంబంధాలున్నాయా అనే అంశాన్ని కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. నిందితులను గుర్తించి అరెస్టు చేసేందుకు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. పోలీసుల అధికారిక దర్యాప్తులో వెల్లడయ్యే వివరాల ఆధారంగానే ఈ హత్య వెనుక అసలు కారణాలు, సంస్థ ప్రకటనలోని వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,
Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in